

రూ.63,266.1 కోట్లతో జిల్లా వార్షిక ప్రణాళిక



జిల్లా వార్షిక ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులు

వ్యవసాయ రంగానికి రూ.7,108 కోట్లు

- గృహ నిర్మాణ అవసరాలకు రూ.1,355 కోట్లు
- విద్యాపరమైన అవసరాలకు రూ.294 కోట్లు
- రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అమలు చేయాల్సిందిగా బ్యాంకుల ప్రతినిధులకు కలెక్టర్ సూచన

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అమలు, పారిశ్రామిక రంగ ఔత్సాహికులు, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రూ.63,266.10 కోట్లతో రూపొందించిన జిల్లా వార్షిక ప్రణాళికను శుక్రవారం కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర్ ప్రసాద్, పలు శాఖల అధికారులు, బ్యాంకు ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ప్రాధాన్యతా రంగాలకు రూ.23,090 కోట్లు, ఇతర రంగాలకు రూ.40,176.59 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.7,108 కోట్లు కేటాయించారు. గృహ నిర్మాణ అవసరాలకు రూ.1,355 కోట్లు, విద్యాపరమైన అవసరాలకు రూ.294 కోట్లు కేటాయించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఎంఎస్ఎంఈ, విద్యా, గృహ రుణాలు, స్వయం సహాయక సంఘాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని రంగాలకు ఫైనాన్సింగ్‌తోపాటు జిల్లా స్థూల విలువ జోడింపు (గ్రాస్ వాల్యూ యాడెడ్..జీవీఏ)లో రెండంకెల వృద్ధిని ... మిగతా 8వ పేజీలో


ధనలక్ష్మిగా శ్రీకనకమహాలక్ష్మి



జగదాంబ కూడలి, అక్టోబరు 4: నగరంలోని బురుజుపేటలో గల శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం ధనలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని లక్ష చామంతి పూలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించిన పట్టు చీరలను లక్కీ షాపింగ్‌మాల్, సౌత్ ఇండియా మాల్ అధినేతలు సమకూర్చారని ఈవో కె.శోభారాణి తెలిపారు. కనకమహాలక్ష్మి అమ్మవారు శనివారం ధాన్యలక్ష్మిగా దర్శనమివ్వనున్నారు.

ఉక్కు ఉద్యోగులకు విద్యుత్ షాక్

- క్వార్టర్లలో ఉంటున్న వారికి రాయితీ ఎత్తివేత
- ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ బిల్లు జీతంలో మినహాయింపు
- ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.20 వేలు కోత



ప్లాంటు జారీ చేసిన పే స్లిప్‌లో విద్యుత్ బిల్లు మొత్తం

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు ఉద్యోగులకు యాజమాన్యం షాక్ ఇచ్చింది. ఇప్పటికే అనేక రకాలుగా ఇబ్బందిపడుతున్న ఉద్యోగులను కరెంట్ బిల్లులతో బెంబేలెత్తించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్లాంటు క్వార్టర్లలో ఉంటున్న వారికి విద్యుత్ యూనిట్‌కు ఎనిమిది రూపాయలు చొప్పున వసూలు చేస్తామని గతంలో ప్రకటించింది. అప్పటివరకూ రాయితీపై యూనిట్ 50 పైసలు చొప్పున ఇచ్చింది. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో రాయితీ ఎత్తేసి ఈపీడీసీఎల్ ఎంత రేటు వేస్తే అంత వసూలు చేస్తామని చెప్పింది. ఉద్యోగులు ఆందోళన చేయడంతో ఆ ఆలోచన విరమించుకుంది. అయితే సెప్టెంబరు నెల ... మిగతా 8వ పేజీలో

మరోసారి తెరపైకి ఐఐటీ హోదా

2005-07 ప్రాంతంలో ఏయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఐఐటీ హోదా ఇచ్చేందుకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం

- సీట్లన్నీ నేషనల్ పూల్‌లోకి వెళ్లిపోతాయనే ఉద్దేశంతో నిరాకరించిన రాష్ట్ర ప్రభుత్వం, వర్సిటీ
- తాజాగా సీఐఐ సదస్సులో మంత్రి లోకేశ్ ముందు ఐటీ పరిశ్రమల నిర్వాహకుల ప్రస్తావన
- ఈసారి ఏం జరుగుతుందోనని క్యాంపస్‌లో చర్చ
- ఉన్నత విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటామంటున్న వర్సిటీ అధికారులు



ఏయూ ఇంజనీరింగ్ కళాశాల

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలకు ఐఐటీ హోదా (ఐఐటీ తత్సమాన విద్యా సంస్థగా గుర్తింపు) కల్పించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కొద్దిరోజుల కిందట నగరంలో జరిగిన సీఐఐ సదస్సుకు హాజరైన మంత్రి నారా లోకేష్ ఎదుట కొందరు ఐటీ రంగ నిపుణులు ఈ ప్రతిపాదనను ఉంచినట్టు చెబుతున్నారు. దీనిపై ప్రస్తుతం విద్యావేత్తల్లో జోరుగా చర్చ సాగుతోంది.

సుదీర్ఘ చరిత్ర కలిగిన ఏయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఐఐటీ హోదా ఇచ్చేందుకు 2005-2007 ప్రాంతంలోనే కేంద్ర ఉన్నత విద్యా మంత్రిత్వశాఖ ముందుకువచ్చింది. దేశంలోని ఏడు పురాతన, ఉన్నత స్థాయి ప్రమాణాలతో ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న కాలేజీలకు ఐఐటీ హోదా ఇవ్వాలని నాడు ఎస్‌కే జోషి కమిటీ సిఫారసు చేసింది. ఎస్‌కే జోషి కమిటీ సిఫారసులపై కేంద్రం నాడు రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖలతో చర్చించింది. అయితే ఐఐటీ హోదా వస్తే ఇంజనీరింగ్ సీట్లన్నీ సెంట్రల్ పూల్‌లోకి వెళ్లిపోతాయని, దానివల్ల రాష్ట్రంలోని విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో అప్పట్లో ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యాశాఖ, ఏయూ తిరస్కరించాయి. బెనారస్ హిందూ యూనివర్సిటీతో పాటు రెండు, మూడు యూనివర్సిటీలు ఆ ప్రతిపాదనను అంగీకరించాయి. మిగిలిన వర్సిటీలన్నీ తిరస్కరించాయి. దీంతో మరోసారి కేంద్ర ఉన్నత విద్యాశాఖ ఆనంద్‌కృష్ణన్ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ ప్రత్యామ్నాయంగా మరో ప్రతిపాదన చేసింది. అదే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఈఎస్‌టీ) హోదా. ఈ హోదా వస్తే సగం రాష్ట్రస్థాయిలో, సగం సీట్లు నేషనల్ పూల్‌లో భర్తీ చేసుకునే వెసులుబాటు కల్పించవచ్చునని పేర్కొంది. అయితే, దీనికి ఉన్నత ఉన్నత విద్యా శాఖ, ఏయూ అధికారులు అంగీకరించలేదు. దీంతో ఐఐటీ, ఐఐఈఎస్‌టీ హోదాలు మరుగున పడిపోయాయి. తాజాగా విద్యాశాఖా మంత్రి వద్ద సీఐఐ ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించడంతో మరోసారి ఐఐటీ హోదాపై చర్చ జరుగుతోంది.

ఐటీ రంగ అభివృద్ధికి దోహదం..

మంత్రి నారా లోకేష్ దృష్టికి సీఐఐ ప్రతినిధులు ఈ అంశాన్ని తీసుకువెళ్లడానికి అనేక అంశాలు కారణంగా చెబుతున్నారు. ఇంజనీరింగ్ కాలేజీకి ఐఐటీ హోదా వస్తే ఐటీ రంగం జోరు పెరుగుతుందంటున్నారు. ఐఐటీ హోదా కలిగిన కాలేజీలు ఉన్నచోట రీసెర్చ్ సెంటర్లు, రీసెర్చ్ హబ్స్ వంటివి ఏర్పాటవుతాయి. దీనివల్ల ఐటీ రంగానికి పెద్దఎత్తున బూమ్ వస్తుంది. అదే సమయంలో ఎంఎన్‌సీ కంపెనీలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఆ ఉద్దేశంతో ఐటీ రంగానికి చెందిన ప్రముఖులు ఈ విషయాన్ని మంత్రి వద్ద ప్రస్తావించినట్టు చెబుతున్నారు. అదే సమయంలో కేంద్రం నుంచి భారీగా నిధులు కూడా వస్తాయి. దీనిపై ఉన్నత విద్యాశాఖ అధికారులతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

ఇబ్బందులతోనే దూరం..

ఐఐటీ హోదా వస్తే ఇంజనీరింగ్ కాలేజీలోని సీట్లన్నీ పూర్తిగా సెంట్రల్ పూల్‌లోకి వెళ్లిపోతాయి. దీంతో స్థానిక (రాష్ట్ర) విద్యార్థులు దేశవ్యాప్తంగా విద్యార్థులతో పోటీ పడి సీట్లు సాధించాల్సి ఉంటుంది. ఇది రాష్ట్రంలోని విద్యార్థులకు కొంత ఇబ్బందికరంగా మారుతుంది. జాతీయ ... మిగతా 8వ పేజీలో

అందని పీఎఫ్, గ్రాట్యుటీ

స్టీల్‌ప్లాంటు రిటైర్డ్ ఉద్యోగుల ఆందోళన

- విధి నిర్వహణలో చనిపోయినా/అనారోగ్యంతో వైదొలగినా.. వారి కుటుంబ సభ్యులకు బేసిక్, డీఏ ప్రతి నెలా చెల్లింపు
- అందుకోసం పీఎఫ్, గ్రాట్యుటీ యాజమాన్యం వద్ద ఉంచాలన్నది నిబంధన
- రిటైర్‌మెంట్ వయసు దాటిన అనంతరం కుటుంబీకులకు ఆ రెండూ అందజేత
- ...అయితే గడచిన ఆరు నెలలుగా నిలిచిపోయిన చెల్లింపులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్‌ప్లాంటులో ఉద్యోగం చేయడమే తాము చేసిన పాపమా?... అని రిటైర్డు ఉద్యోగులు వాపోతున్నారు. ఏప్రిల్ నుంచి రిటైర్డు ఉద్యోగులకు ఏ రకమైన ఆర్థిక ప్రయోజనాలు కల్పించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దాంతో వారికి పూట గడవడమే కష్టంగా మారింది.

స్టీల్‌ప్లాంటులో ఎవరైనా ఉద్యోగంలో ఉండగా చనిపోతే వారికి వచ్చే ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ మొత్తం తీసుకోకుండా యాజమాన్యం వద్ద వదిలేస్తే, ఆ ఉద్యోగిపై ఆధారపడిన కుటుంబానికి రిటైర్‌మెంట్ వయస్సు (60) వచ్చే వరకూ బేసిక్, డీఏ పెన్షన్‌గా ప్రతి నెలా ఇస్తారు. రిటైర్‌మెంట్ గడువు పూర్తయిన తరువాత పెన్షన్ ఆపేస్తారు. ఏదైతే మొత్తం అంతకు ముందు వదులుకున్నారో దానిని మాత్రం ఆ కుటుంబానికి వెనక్కి ఇస్తారు. ఆ మొత్తంతో ఆ కుటుంబం బతుకుంది. ఇలా చనిపోయిన, అనారోగ్య కారణాలతో మానేసిన ఉద్యోగులు 80 మంది వరకు ఉన్నారు. వారి పదవీ విరమణ వయస్సు ఈ ఏడాది మార్చితో ముగిసిపోయింది. ఏప్రిల్ నుంచి వారికి నెల నెలా ఇచ్చే పెన్షన్లు ఆపేశారు. అయితే వారికి వెనక్కి ఇవ్వాల్సిన ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యుటీ మొత్తాలను మాత్రం ఆర్ఐఎన్ఎల్ ఆర్థిక విభాగం మంజూరుచేయడం లేదు. ఆరు నెలలు అవుతున్నా వారికి డబ్బులు ఇవ్వడం లేదు. సమాధానం చెప్పడం లేదు. ఇటు పెన్షన్ ... మిగతా 8వ పేజీలో

పర్యాటక ప్రాజెక్టులపై కొనసాగిన విచారణ



యాత్రీ నివాస్‌లో విచారణ నిర్వహిస్తున్న కమిటీ

- అప్పుఘర్ సమీపాన గల యాత్రీ నివాస్ సందర్శన
- ఆధునికీకరణ పనుల జాప్యంపై ఆరా

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్యాటక ప్రాజెక్టుల లీజులు, హోటళ్లు, అతిథి గృహాల నిర్వహణపై ప్రభుత్వం నియమించిన కమిటీ రెండో రోజు శుక్రవారం కూడా విచారణ నిర్వహించింది. అప్పుఘర్ సమీపాన గల హరిత రిసార్ట్ (యాత్రీ నివాస్)కు వెళ్లి ఆధునికీకరణ పనుల ఆలస్యంపై ఆరా తీసింది. నిధులు సరిపోలేదని కాంట్రాక్టర్ మధ్యలో పనులు వదిలేసి వెళ్లిపోయిన విషయం బయటపడింది. హరిత ప్రాజెక్టును ఆధునికీకరించిన తరువాత సెప్టెంబరు 28న వర్చువల్‌గా సీఎం చంద్రబాబుతో ప్రారంభించాలని ... మిగతా 8వ పేజీలో

సీసీఎఫ్ శ్రీకాంత్‌నాథ్‌రెడ్డి బదిలీ

- వార్త మెయిన్ 5లో

వీఎంఆర్‌డీఏ మాస్టర్‌ప్లాన్ విస్తరణ

- అనకాపల్లి జిల్లాలో 12 మండలాలకు...
- విజయనగరం జిల్లాలో ఒక మండలం...
- అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక రూపకల్పన
- గ్లోబల్ టెండర్ల ద్వారా ఏజెన్సీ ఎంపిక



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) మాస్టర్ ప్లాన్‌ను విస్తరించనుంది. ఇంతకు ముందు మాస్టర్ ప్లాన్-2021-2041ను రూపొందించినప్పుడు అనకాపల్లి జిల్లాలోని 12 మండలాలను, విజయనగరం జిల్లాలో మెరకముడిదాం మండలాన్ని అందులో చేర్చలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి జిల్లాపై దృష్టిసారించింది. అభివృద్ధికి వీలుగా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని వీఎంఆర్‌డీఏను ఆదేశించింది.

అనకాపల్లి జిల్లాలో 24 మండలాలు ఉండగా జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న వాటినే గతంలో మాస్టర్‌ప్లాన్ తయారీలో పరిగణనలోకి తీసుకున్నారు. మరోవైపున ఉన్న వాటిని పట్టించుకోలేదు. అందులో నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, రావికమితం, రోలుగుంట, దేవరాపల్లి, చీడికాడ, బుచ్చెయ్యపేట, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం, కె.కోటపాడు మండలాలు ఉన్నాయి. ఈ ప్రాంతాలను ఇతర ప్రాంతాలతో కలుపుతూ మాస్టర్ ప్లాన్ తయారుచేయాల్సి ఉంది.

నాడు రూ.10 కోట్ల వ్యయంతో వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ 2021-2041ను రూ.10 కోట్ల వ్యయంతో రూపొందించారు. 2011లో అధ్యయనానికి శ్రీకారం చుట్టి 2016లో లీ అసోసియేట్స్ సంస్థకు బాధ్యత అప్పగించారు. దానికి ఆ సంస్థ రూ.10 కోట్లు వసూలుచేసింది. వైసీపీ ప్రభుత్వం త్వరగా మాస్టర్ ప్లాన్ పూర్తిచేయాలని ఒత్తిడి పెట్టడంతో పూర్తికాకపోయినా సరే 2021లో సమర్పించేసింది. దాంతో అనకాపల్లి జిల్లాలో 12 మండలాలు, అటు మెరకముడిదాం మండలానికి ప్రణాళికలు రూపొందలేదు. అయితే వాటికి సంబంధించిన ఫొటోలు, సమాచారం ఆ సంస్థ సేకరించి పెట్టుకుంది. ఇప్పుడు వాటి గురించి ప్రశ్నిస్తే తనకు నష్టం వచ్చిందని, ఇంకో నాలుగు కోట్ల రూపాయలు ఇస్తే వాటికి మాస్టర్ ప్లాన్ తయారుచేస్తానని చెబుతోంది. దాంతో అధికారులు పునరాలోచనలో పడ్డారు.

ప్రణాళికలో ఏముంటాయి?

ఆయా మండలాల్లో ఉన్న వనరులు, నీటి సదుపాయం, పంటలు, పరిశ్రమలు, జనాభా, విద్యా సంస్థలు, పర్యాటక ప్రాంతాలు, పరిశ్రమలు, రహదారులు, రైలు మార్గాలు, వాటి మధ్య అనుసంధానం, ట్రాఫిక్ ఇలాంటివన్నీ అధ్యయనం చేస్తారు. వాటి ఆధారంగా ఏ ప్రాంతంలో ఏ తరహా అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయవచ్చునో సూచించి, వాటికి ఆ ప్రాంతాలను ... మిగతా 8వ పేజీలో

ఏయూకు ఐఎస్‌వో గుర్తింపు



ఐఎస్‌వో ధ్రువపత్రంతో వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు

విశాఖపట్నం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఐఎస్‌వో 9001:2015 గుర్తింపు (సర్టిఫికేషన్) లభించింది. ఇది 2027 సెప్టెంబరు ఆరో తేదీ వరకూ వర్తిస్తుంది. ఇటీవల ఏయూను సందర్శించిన ఐఎస్‌వో నిపుణుల బృందం వివిధ అంశాలను పరిశీలించి ఈ గుర్తింపును కొనసాగిస్తూ ఉత్తర్వులను జారీచేసింది. దీనికి సంబంధించిన ధ్రువపత్రాన్ని ఏయూ ఐక్యూఏసీ సమన్వయకర్త ప్రొఫెసర్ గిరిజాశంకర్ శుక్రవారం ఏయూ వీసీ ప్రొఫెసర్ జి.శశిభూషణరావుకు అందించారు. ఐఎస్‌వో గుర్తింపు వచ్చేందుకు కృషిచేసిన ఆయా విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బందిని వీసీ అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు, రెక్టార్ ప్రొఫెసర్ ఎన్.కిషోర్‌బాబు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ కె.ఈశ్వర్‌కుమార్, ప్రిన్సిపాల్స్ ప్రొఫెసర్ ఎ.నరసింహరావు, ప్రొఫెసర్ నాగరాజకుమారి పాల్గొన్నారు.

రాత్రి గస్తీపై నిర్లక్ష్యం!

గతంతో పోల్చితే తగ్గిన బీట్లు

- విజయవాడ బందోబస్తుకు 250 మంది సిబ్బంది
- మూడు ఏఆర్ పార్టీలు కూడా...
- శాంతిభద్రతలపై తీవ్ర ప్రభావం
- రెచ్చిపోతున్న ఆకతాయిలు, నేరగాళ్లు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో రాత్రి గస్తీ గాడి తప్పింది. పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి బీట్‌ల సంఖ్య గతంతో పోల్చితే తగ్గిపోయింది. దీంతో రాత్రివేళ నగరంలో ఆకతాయిలు ఆగడాలు, నేరగాళ్ల దాడులు, దొంగతనాలు పెరిగిపోయాయి. రెండు రోజుల కిందట ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్ వద్ద స్విగ్గీ డెలివరీ బాయ్‌పై గంజాయి బ్యాచ్ దాడికి దిగేందుకు యత్నించింది. అలాంటి సంఘటనలు అంతకుముందు కూడా అనేకం చోటుచేసుకోవడంతో నగరంలో రాత్రిపూట భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. చోరీల నియంత్రణతో పాటు వివిధ పనులపై బయట తిరిగే ప్రజలకు భద్రత కల్పించడం కోసం పోలీసులు నైట్ పెట్రోలింగ్ పేరుతో గస్తీ తిరుగుతుంటారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో శాంతిభద్రతల విభాగంతోపాటు క్రైమ్ విభాగం నుంచి వేర్వేరుగా బీట్‌లు తిరుగుతుంటారు. ఒక్కో బీట్‌లో ఒక ఏఎస్ఐ/హెడ్ కానిస్టేబుల్‌తోపాటు కానిస్టేబుల్/హోంగార్డు ఉంటారు. స్టేషన్ పరిధి, చోరీలు జరిగే పరిస్థితిని బట్టి క్రైం విభాగం నుంచి నాలుగు నుంచి ఎనిమిది చొప్పున నగరంలో 140 నుంచి 150 బృందాలు తిరుగుతుంటాయి. అలాగే లా అండ్ ఆర్డర్ నుంచి ఐదు నుంచి ఎనిమిది చొప్పున 180 బృందాలు తిరుగుతుంటాయి. బీట్ సిబ్బంది రాత్రి పది నుంచి తెల్లవారుజామున ఐదు గంటల వరకూ తమకు కేటాయించిన రూట్‌లో రాత్రిపూట గస్తీ తిరుగుతూ అనుమానితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించడం, ఆకతాయిలు కనిపిస్తే స్టేషన్‌కు ... మిగతా 8వ పేజీలో


పూర్ణామార్కెట్‌లో దుర్గాలమ్మ


కళింగనగర్ జంక్షన్‌లో గాయత్రిమాత


సీతంపేట పార్వతీశ్వరాలయంలో


వీరాంజనేయునిగా వెంకటేశుడు


డాబాగార్డెన్స్‌లో ఉమాదేవి


సీతమ్మధారలో కన్యకాపరమేశ్వరి

అమ్మలగన్నయమ్మకు అలంకరణల శోభ

జగదాంబ కూడలి, అక్టోబరు 4: శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజైన శుక్రవారం నగరంలో పలుచోట్ల అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పాతనగరంలో సుప్రసిద్ధ దుర్గాలమ్మ అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా కనిపించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. గ్రామ దేవతగా వెలసిన దుర్గాలమ్మకు దసరా పర్వదినాల్లో ప్రత్యేక పూజలు చేయడం, మాలధారణ, మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. శనివారం గాయత్రి దేవిగా, 6న అన్నపూర్ణ, 7న లలితాదేవి, 8న మహాలక్ష్మి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్ధిని, విజయ దశమి రోజైన 12న రాజరాజేశ్వరీ దేవిగా దుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు. అమ్మవారి మూల విరాట్టునే రోజుకో రూపంలో అలంకరించడం విశేషం.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట గల శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి అమ్మవారు గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భార్గవశర్మ సంప్రదాయరీతిలో ఘనంగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి దివ్య మంగళహారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాభాయి, ఎం.మన్మథరెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాధవధార: మాధవధార ప్రాంతంలో దుర్గా అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. కాలనీలు, మెయిన్ రోడ్ జంక్షన్ల వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో వెలసిన దేవీ మండపాల్లో అమ్మవార్లకు విశిష్ట పూజలు చేస్తున్నారు. కళింగనగర్ జంక్షన్‌లో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆటో స్టాండ్ నిర్వహణలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. సీతన్నగార్డెన్స్‌లో కొలువైన దుర్గా గాయత్రీ సహిత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని సామూహిక కుంకుమ పూజ చేశారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

అల్లిపురం: అల్లిపురం సాయి శ్రీ మేరుట్రస్ట్ సాయి దర్బార్ ప్రాంగణంలో వేంచేసి ఉన్న అనఘలక్ష్మి వారాహి రాజ శ్యామల అమ్మవార్ల సన్నిధానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళధ్వని, గోపూజ, గణపతి పూజ వేదమంత్రాలతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ వారాహి అమ్మవారు శుక్రవారం గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో మహిళలు సామూహిక కుంకుమ పూజ చేసి, లలితా సహస్ర నామం పఠించారు. విజయ దశమి వరకు అమ్మవారికి పూజలు, హోమాలు జరుగుతాయని ట్రస్ట్ సభ్యుడు పి.శ్రీనివాస సుబ్రహ్మణ శాస్త్రి కోరారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవిని స్థాపన చేశారు. ఈవో సురేష్ బాబా పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

పార్వతీశ్వరాలయంలో...

సీతంపేట: గణేష్‌నగర్ పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాజీ శర్మ, భాస్కర శర్మ, ఇతర అర్చక బృందం వేదమంత్రాలతో అమ్మవారికి పూజలు చేశారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌లోని మహా గణపతి, ప్రసన్న వెంకటేశ్వర, అయ్యప్ప, షిరిడి సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు, దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి వారిని జై వీరాంజనేయ స్వామి అలంకరణలో, దుర్గాదేవిని కన్యకాపరమేశ్వరిగా అలంకరించారు. లయ ఈఓ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో గరుడ వాహనంపై తిరువీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు.

ఉత్సవాల ఊరేగింపులో డీజేలు నిషేధం: ఏసీపీ

సీతమ్మధార, అక్టోబరు 4: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న సంఘాలు, యువత, భక్తులు తప్పనిసరిగా పోలీసులు, జీవీఎంసీ నియమ, నిబంధనలు పాటించాలని ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సూచించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సిందుర ఫంక్షన్ హాలులో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మండపాల నిర్వాహకులతో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసీపీ లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ ఉత్సవాల్లో డీజేలు, బాణసంచాను నిషేధించామన్నారు. ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, ఎవరికీ ఇబ్బందులు కలిగించకుండా, పెద్ద శబ్దాలతో డీజేలు పెట్టకుండా భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ జి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కె.లక్ష్మణమూర్తి

తేడా వస్తే నిర్వాహకులదే బాధ్యత

మర్రిపాలెం: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధిలోని కాలనీల్లో దేవినవరాత్రుల ఉత్సవ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ చక్రధరరావు కోరారు. శుక్రవారం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అమ్మవారి మండపాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగి తే నిర్వహకులే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. అవసరమనుకుంటే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉత్సవాల నిర్వాహకులకు తెలిపారు. ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో పేర్లు నమోదు చేయించుకోండి

అక్కయ్యపాలెం, అక్టోబరు 4: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌లో అర్హులైన ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేయించుకోవాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె, బీజేపీ నాయకురాల్లు శ్యామలా దీపిక ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రేటర్ 43వ వార్డులో ఆయుష్మాన్ భారత్ అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. దీని ఉపయోగప్రయోజనాలను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు తెలియజేసి నమోదు చేయించారు.

టమాటా కోసం బారులు



అక్కయ్యపాలెం, అక్టోబరు 4: టమాట ధర ఒక్కసారిగా పెరిగిపోవడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. రైతుబజార్లలో శుక్రవారం టమాట ధర కిలో రూ.75కు చేరింది. బహిరంగ మార్కెట్లలో రూ.100 దాటిపోవడంతో వినియోగదారులు రైతు బజార్లలోని విక్రయ స్టాళ్ల ఎదుట బారులు తీరారు. నగరానికి అధిక శాతం టమాట మదనపల్లె నుంచి దిగుమతి అవుతుంది. కొద్దిరోజులుగా అక్కడి నుంచి సరుకు తక్కువగా వస్తోంది. శుక్రవారం నరసింహనగర్ రైతుబజారులో టమాట కోసం కొనుగోలుదారులు ఉదయం నుంచి బారులు తీరారు.

వృద్ధుడి ఆత్మహత్య

సీతంపేట, అక్టోబరు 4: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి పోర్టు క్వార్టర్స్ వద్ద ఒక వృద్ధుడు ఇంటి హుక్కుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పోర్టు క్వార్టర్స్‌లో సబ్బవరపు గణేష్ (60) తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. గణేష్ పరుపులు కుడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఎక్కువగా మద్యం తాగేవాడు. ఈ క్రమంలో పోర్టు క్వార్టర్స్‌లో శుక్రవారం రాత్రి ఇంటిలో ఉన్న వంట గది హుక్కుకు తాడుతో ఉరేసుకున్నాడు. అతని కుమారుడు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అతడి మృతికి కారణాలు తెలియవలసి ఉందని ఎస్ఐ ప్రమీల తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 4: రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి వద్ద నుంచి రూ.75 వేలు విలువ చేసే 15 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని రైల్వే పోలీసులకు (జీఆర్పీ) అప్పగించారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎ.ఆర్.బిశోయ్ తన సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశాకు చెందిన గోపాల్ పంగి, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశాదాస్‌లు గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. వారిని జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారామ్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారని రైల్వే పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

మిసెస్ ఇండియా విజేతకు సన్మానం



హేమలత రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

సీతంపేట, అక్టోబరు 4: మలేషియాలో జరిగిన గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా పోటీల్లో విజేతగా నిలిచిన విశాఖకు చెందిన హేమలత రెడ్డి సన్మాన కార్యక్రమాన్ని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఫైడా కృష్ణ ప్రసాద్, నిర్వాహకులు హేమలత రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, విజేత హేమలత రెడ్డి విశాఖవాసి కావడం గర్వకారణమన్నారు. హేమలత రెడ్డి అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా హేమలత రెడ్డి మాట్లాడుతూ విశాఖలోనే అన్నీ నేర్చుకున్నానన్నారు. ఇప్పుడు ఈ స్థాయిలో ఉండటానికి తల్లిదండ్రుల ఆశీస్సులు, దేవుని కరుణ కారణమని తెలిపారు. త్వరలో ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌కు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, గంట్ల శ్రీనుబాబు, వీరుమామ పాల్గొన్నారు.

కోరాపుట్, అరకు సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, అక్టోబరు 4: వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరబ్‌ప్రసాద్ శుక్రవారం కోరాపుట్, అరకు సెక్షన్‌లో తనిఖీ చేసి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కోరాపుట్ రైల్వేస్టేషన్‌లో యార్డు, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్, ఇంజనీరింగ్ పరికరాల నిర్వహణపై ఆరాతీశారు. రిలీఫ్ ట్రైన్‌లోని పరికరాలను, వినియోగించే నైపుణ్య పరిజ్ఞానంతోపాటు సేఫ్టీ గాడ్జెట్‌లు, ఆపరేషన్ పద్ధతులను పరీక్షించారు. అలాగే క్రూలాబీ, రన్నింగ్ రూమ్ నిర్వహణను తనిఖీ చేశారు. దమన్‌జోడి, కోరాపుట్ స్టేషన్ల మధ్య వంతెనలు, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, భద్రతా అంశాలను పరిశీలించారు. డబ్లింగ్ లైను నిర్మాణం, ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఏడీఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినుల వంటకాలతో ఆహారోత్సవ్

మహారాణిపేట, అక్టోబరు 4: మన సంప్రదాయ వంటకాల నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థినులతో ఆహారోత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు కాశ్యప్ కరస్పాండెంట్ టీఆర్ఎస్ వర్మ అన్నారు. శుక్రవారం మహారాణిపేటలో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. వంటకాల వైవిధ్యాన్ని జరుపుకొనేందుకు విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. పలువురు వంటకాల రుచి చూసి వారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతి వారసత్వం గుబాళిస్తుందన్నారు.


వంటకాలు తయారు చేస్తున్న విద్యార్థినులు

వైసీపీ నూతన అధ్యక్షుడికి అభినందన

మురళీనగర్, అక్టోబరు 4: వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్‌ను శుక్రవారం ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, విశాఖ జిల్లా కళింగ సంఘం అధ్యక్షుడు పేడాడ నర్సింగరావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అమర్నాథ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. నూతన అధ్యక్షుడిగా పార్టీకి మరింత పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా ఆయన సేవలందించాలని ఆకాంక్షించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి నాయకుడు, కార్యకర్తకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని అమర్నాథ్ పేర్కొన్నారని తెలిపారు.


అమర్‌నాథ్‌తో పేడాడ నర్సింగరావు, రమణికుమారి

'మద్యం దుకాణాల కేటాయింపులో పారదర్శకత ఉండాలి'

అక్కయ్యపాలెం, అక్టోబరు 4: మద్యం దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు కోరారు. నరసింహనగర్‌లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ యాత వర్గీయులకు 10 శాతం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరికి ఏ దుకాణం కేటాయిస్తున్నారన్న విషయంపై స్పష్టత లేదన్నారు. దుకాణాలు పొందిన వ్యక్తులకు సంక్షేమ పథకాలు రద్దుకాకుండా చూడాలన్నారు. సమావేశంలో గొడ్డి కన్నారావు, కొలుసు అచ్చిబాబు, సంపంగి మంగరాజు, రమణ, ఓసుం దేవుడు, నెల్లి దేముడు, నెల్లి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విభాష్యం రాజేశ్వరరావుకు అడివి బాపిరాజు అవార్డు

సీతంపేట, అక్టోబరు 4: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్, సహృదయ సాహితీ సంస్థ సంయుక్తంగా ప్రముఖ కథారచయిత ద్విభాష్యం రాజేశ్వరరావుకు అడివి బాపిరాజు అవార్డు ప్రదానం చేశారు. సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురాం, ఓలేటి పార్వతీశంలు పాల్గొని రాజేశ్వరరావుకు అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. డాక్టర్ కేజీ వేణు, సినీ విశ్లేషకులు ఎస్వీ రామారావు, కొవ్వలి లక్ష్మీనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, మస్తాన్ రెడ్డి, ఆదూరి, డాక్టర్ కేవీఎస్ మూర్తి, డాక్టర్ నిర్మలదేవి, బి.రాధారాణి, పరమేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ వెలమల సిమ్మన్న పాల్గొన్నారు.


రాజేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

'పోర్టు ఆసుపత్రిపై నిర్ణయం మార్చుకోవాలి'

అక్కయ్యపాలెం, అక్టోబరు 4: పోర్టు ఆసుపత్రిని పీపీపీకి ఇవ్వాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ నాయకుడు వీఎస్ పద్మనాభరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రి ఎదుట జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాల్గో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలనే కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ ఈ ప్రతిపాదన విరమించుకోవాలని, పోర్టు సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బిజగన్, కె.సత్యనారాయణ, నర్సింగరావు, ఈశ్వరరావు, శంకరరావు, రాఘవులు, జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ విస్తరణ

... 7వ పేజీ తరువాయి

కేటాయిస్తారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, పర్యాటక ప్రాంతాలు, ఆస్పత్రులు, స్టేడియాలు, కొత్త రహదారులు, వాటి మధ్య అనుసంధానం, అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణం, సరకు రవాణాకు వీలుగా కారిడార్లు వంటివి అందులో ఉంటాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రహదారులను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తుంది. ఆ ప్లాన్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలకు భూములు కేటాయిస్తారు. పారిశ్రామిక పార్కులు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు వంటివి వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక అంతా అందులో ఉంటుంది.

గ్లోబల్ టెండర్ల ద్వారా ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం ఆయా మండలాలు కూడా వీఎంఆర్‌డీఏలో ఉన్నందున మాస్టర్‌ప్లాన్‌ను విస్తరించాల్సిందిగా సూచించింది. దీనికి గ్లోబల్ టెండర్ల ద్వారా ఏజెన్సీని ఎంపిక చేయాలని అనుకుంటున్నాము. దీనివల్ల తక్కువ వ్యయంతో, తక్కువ సమయంలో ప్రభావవంతమైన ప్రణాళిక తయారవుతుందని భావిస్తున్నాము. త్వరలోనే టెండర్లు పిలుస్తాం.

\- విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

ఉక్కు ఉద్యోగులకు విద్యుత్ షాక్

... 7వ పేజీ తరువాయి

జీతాల స్లిప్ అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఉద్యోగులకు ఇస్తున్నారు. వాటిని చూసి అంతా ఆందోళన చెందుతున్నారు. క్వార్టర్లలో ఉంటున్న వారికి ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ ఎంత విద్యుత్ వినియోగించారో అన్ని యూనిట్లకు ఎనిమిది రూపాయల చొప్పున లెక్కగట్టి జీతం నుంచి కోత వేసింది. ఇలా ఒక్కొక్కరి జీతం నుంచి అధమంగా పది వేల రూపాయల నుంచి అత్యధికంగా రూ.23 వేల వరకూ కోత విధించింది. జీతంలో సగం మొత్తం విద్యుత్ బిల్లుకు తీసుకుంటే ఏమి తిని బతకాలని ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వాయిదాల పద్ధతిలో కట్ చేసినా బాగుండేదంటున్నారు.

వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు

నర్సీపట్నం, అక్టోబరు 4: నర్సీపట్నంలో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ తెలిపారు. జిల్లాలో నవోదయం కార్యక్రమం పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నాటు సారా, గంజాయి నివారణకుచర్యలు తీసుకుంటామన్నారు.

బజాజ్ ఆటో నుంచి గేమ్ ఛేంజర్ బైక్



సీఎన్‌జీ బైక్ బజాజ్ ఫ్రీడమ్ 125ను ఆవిష్కరిస్తున్న వరుణ్‌గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్

సిరిపురం, అక్టోబరు 4: బజాబ్ ఆటో ప్రవేశపెట్టిన ప్రపంచపు మొట్టమొదటి సీఎన్‌జీ గేమ్ ఛేంజర్ బైక్ బజాజ్ ఫ్రీడమ్ 125ను శుక్రవారం సిరిపురం వరుణ్ బజాజ్ షోరూంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, బజాజ్ ఆటో రీజనల్ మేనేజర్ సర్వీస్ సచిన్ జైన్, బజాజ్ ఆటో ఏరియా సర్వీస్ మేనేజర్ ఎన్.భువనేశ్, బజాజ్ ఆటో ఏరియా మేనేజర్ సేల్స్ అబాస్ శేఖరన్ హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సరికొత్త బజాజ్ ఫ్రీడమ్ బైక్ ట్విన్ ట్యాంక్ సెటప్‌ను కలిగి ఉంటుందన్నారు. ఒక ట్యాంక్ పెట్రోల్, మరో ట్యాంక్ సీఎన్‌జీ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేశారన్నారు. ఇందులో రెండురకాల ఫ్యూయల్స్‌ను వాడుకోవచ్చునన్నారు. ఫ్యూయల్ ఆప్షన్‌ను ఎంచుకోవడానికి ప్రత్యేకంగా రెండు స్విచ్‌లను ఏర్పాటుశారన్నారు. మూడు రకాల వేరియంట్లలో ఈ బైక్ లభ్యమవుతుందని, మొదటి ఎంట్రీ లెవల్ వేరియంట్ బజాజ్ ఫ్రీడమ్ 125 డ్రమ్ ఎక్స్‌షోరూం ధర రూ.95 వేలు కాగా, రెండోది మిడ్ రేంజ్ వేరియంట్ ధర రూ.1.05 లక్షలు, మూడోది టాప్‌ఎండ్ వేరియంట్ డిస్క్ ఎల్ఈడీ రూ.1.10 లక్షలని వివరించారు. ఈ కార్యక్రమంలో వరుణ్ బజాజ్ సీఈఓ ఆదారి శ్రీనివాస్, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.63,266.1 కోట్లతో జిల్లా వార్షిక ప్రణాళిక

... 7వ పేజీ తరువాయి

సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ ప్రణాళిక దోహదపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను ప్రోత్సహించేలా రైతులకు అండగా నిలిచేలా రుణ మంజూరు ప్రక్రియ ఉండాలన్నారు. సాధారణ పౌరుల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత కాలంలో రుణాలు అందించాలన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి ఎక్కువ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అమలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకులు అందిస్తున్న రుణ సాయం గురించి ఆరా తీసిన కలెక్టర్ అందరికీ ప్రయోజనం కలిగిలా సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్, రిజర్వుబ్యాంకు ప్రతినిధి పి.పూర్ణిమ, నాబార్డు డీజీఎం సమంత్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, పలువురు అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరోసారి తెరపైకి ఐఐటీ హోదా

... 7వ పేజీ తరువాయి

స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలోని విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న అతి పెద్ద కాలేజీకి ఐఐటీ హోదా కల్పిస్తే లోకల్ విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుందనే వాదన కూడా ఉంది. అందుకే ఈ విషయంలో వర్సిటీ అధికారులు వెనక్కి తగ్గుతున్నట్టు చెబుతున్నారు. దీనిపై ప్రస్తుత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావును వివరణ కోరగా గతంలో ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ప్రస్తుతా నికి తాము ఎటువంటి ప్రతిపాదనలు పెట్టలేదన్నారు. దీనిపై ఉన్నత విద్యా శాఖ ఆదే శాలకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు.

అందని పీఎఫ్, గ్రాట్యుటీ

... 7వ పేజీ తరువాయి

అందక, అటు దాచుకున్న మొత్తం ఇవ్వకపోతే తాము ఎలా బతుకుతామని ఉద్యోగుల కుటుంబాలు వాపోతున్నాయి. ఇప్పటికే కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయి బాధపడుతుంటే...తాము దాచుకున్న, న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన సొమ్మును వెనక్కి ఇవ్వడానికి ఎందుకు తాత్సారం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఆ 80 మందిలో ముగ్గురు ఉద్యోగుల భార్యలు కూడా ఇటీవల చనిపోయారు. అంటే ఆ కుటుంబాలకు అమ్మ, నాన్నలు లేరు. యాజమాన్యం ఇచ్చే పీఎఫ్, గ్రాట్యుటీలే పిల్లలకు ఆధారం. వారి చదువులు, వివాహాలకు వాటిని ఉపయోగించుకోవాలని ఆశిస్తున్నారు. ఆరు నెలలు అవుతున్నా ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని, ప్లాంటులో ఉన్నతాధికారులకు లంచాలు ఇచ్చే వారికే బిల్లులు మంజూరు చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. తమకు వెంటనే సెటిల్‌మెంట్ చేయకపోతే పిల్లలతో కలిసి ప్లాంటు ముందే ప్రాణం తీసుకుంటామని పలువురు హెచ్చరిస్తున్నారు.

ఉక్కు మంత్రిత్వ శాఖను అడగమంటున్నారు

నా పేరు డీవీ శర్మ. స్టీల్‌ప్లాంటులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేసి అనారోగ్య కారణాలతో రాజీనామా చేశాను. మార్చి నెలతో నాకు 60 ఏళ్లు పూర్తయ్యాయి. నేను దాచుకున్న పీఎఫ్, గ్రాట్యుటీ కోటి రూపాయల వరకూ యాజమాన్యం వద్ద ఉన్నాయి. రిటైర్‌మెంట్ వయస్సు అయిపోయిందని పెన్షన్ రంచనుగా ఏప్రిల్ నుంచి ఆపేశారు. మరి మాకు రావలసిన మొత్తాలు ఇవ్వడం లేదు. ప్లాంటులో ఆర్థిక విభాగం అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఉక్కు మంత్రిత్వ శాఖను వెళ్లి అడగండని సమాధానం చెబుతున్నారు. - డీవీ శర్మ, రిటైర్డు ఉద్యోగి

పర్యాటక ప్రాజెక్టులపై కొనసాగిన విచారణ

... 7వ పేజీ తరువాయి

నిర్ణయించారు. అయితే ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకం వల్ల అది ఇప్పటికీ పూర్తికాలేదు. దీనిపై కూడా కమిటీ విచారించింది. ఆ తరువాత సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్‌లోని పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయానికి వెళ్లి రుషికొండలో కూలగొట్టిన హరిత రిసార్ట్స్‌లోని ఫర్నీచర్ ఏమైందని ప్రశ్నించింది. ఆ సమయంలో అక్కడ పనిచేసిన సిబ్బంది వేరే ప్రాంతంలో ఉంటే వారిని పిలిపించి విచారణ జరిపింది. గోడౌన్‌లో ఉన్నట్టు సమాధానం చెప్పడంతో వాటిని పరిశీలిస్తామని కమిటీ పేర్కొంది. ఆ తరువాత అదే భవనంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిని కలిసి జిల్లాలో పర్యాటక అంశాలపై పలు వివరాలు సేకరించింది. తొట్లకొండలో బే వాచ్ రిసార్ట్ లీజులో విచారణ నివేదిక అడిగి కమిటీ తీసుకుంది. ఆ తరువాత రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్‌కు మరోసారి వెళ్లి అక్కడి కార్యకలాపాలపై ఆరా తీసింది.

రాత్రి గస్తీపై నిర్లక్ష్యం!

... 7వ పేజీ తరువాయి

తరలించి కౌన్సెలింగ్ ఇవ్వడం, రోడ్లపై అనవసరంగా తిరిగే వారిని ఇళ్లకు పంపించడం చేస్తుంటారు. దీనివల్ల నగరంలో చోరీలకు కొంతవరకూ అడ్డుకట్ట పడడంతోపాటు గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిలకు ముకుతాడు వేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే నగరంలో గత కొద్దిరోజులుగా రాత్రి గస్తీ తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజయవాడలో దుర్గా నవరాత్రి ఉత్సవాలకు బందోబస్తు కోసం నగరం నుంచి 250 మంది సిబ్బందిని పంపించారు. వారితోపాటు మూడు ఏఆర్ పార్టీలను కూడా పంపించారు. రాత్రి బీట్ తిరిగే వారిని ఇతర అవసరాలకు కేటాయిస్తున్నారు. దీనివల్ల నగరంలో రాత్రివేళ పోలీస్ నిఘా, పెట్రోలింగ్ కొరవడింది. ప్రస్తుతం క్రైమ్ బీట్‌లు 100కి తగ్గిపోగా, లా అండ్ ఆర్డర్ బీట్‌లు కూడా 120కి తగ్గిపోయినట్టు తెలిసింది. రాత్రి బీట్‌లు తగ్గిపోవడంతో నేరస్థులు, ఆకతాయిలు చెలరేగిపోతున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగా వెళ్లే వాహన చోదకులు, పాదచారులను అడ్డగించి దోచుకోవడం, దాడులకు పాల్పడడం వంటి సంఘటనలు నమోదవుతున్నాయి. ఈనెల రెండో తేదీ రాత్రి స్విగ్గీ డెలివరీ బాయ్ మద్దిలపాలెం ఏయూ ఆర్చ్ నుంచి పెదవాల్తేరు వైపు వెళుతుండగా ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్ సమీపానికి వెళ్లేసరికి అతని బైక్‌ను గంజాయి మత్తులో ఉన్న కొంతమంది అడ్డగించారు. కత్తులతో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొనేందుకు యత్నించారు. స్విగ్గీ బాయ్ కేకలు వేయడంతో పరారైపోయారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల అనేకం జరిగాయి. పోలీసు అధికారులు ఇప్పటికైనా రాత్రి గస్తీపై దృష్టిసారించాలి.

దూరప్రాంతాలకు ఆరు ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 4: దసరా ప్రయాణికుల రవాణాకు ఆర్టీసీ శుక్రవారం ఆరు ప్రత్యేక సర్వీసులు నడిపింది. హైదరాబాద్‌కు 12 షెడ్యూల్ సర్వీసులున్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ మేరకు మరో మూడు ప్రత్యేక సర్వీసులు, విజయవాడకు ప్రతి గంటకు షెడ్యూల్ సర్వీస్ ఉన్నప్పటికి సీటింగ్ కెపాసిటీకి మించి డిమాండ్ ఉండడంతో మూడు ప్రత్యేక సర్వీసులు నడిపింది. శనివారం సాయంత్రం నుంచి మరిన్ని ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధం చేశామని విశాఖ రీజియన్ అధికారులు తెలిపారు.

'ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం'



తమ్మిరెడ్డి శివ శంకర్‌ను అభినందిస్తున్న జనసేన నాయకులు

కూర్మన్నపాలెం, అక్టోబరు 4: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన నాయకులు కాదా శ్రీను, గవర సోమశేఖర్ అన్నారు. శుక్రవారం విజయవాడ జనసేన పార్టీ కార్యాలయంలో ఏపీ మైక్రో స్మాల్ స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ (ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్) పదవీ బాధ్యతలు చేపట్టిన తమ్మిరెడ్డి శివ శంకర్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంచకర్ల సందీప్, పీలా రామకృష్ణ, అరవింద్, రామకృష్ణ, దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

సమస్యలపై కమిషనర్‌కి వినతి

సింధియా, అక్టోబరు 4: జీవీఎంసీ 63వ వార్డులో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ సంపత్ కుమార్‌కు కార్పొరేటర్ గల్లా చిన్నా శుక్రవారం వినతి పత్రం అందజేశారు. గ్రామాల అభివృద్ధి, కొత్త ప్రాజెక్టులతోపాటు కొండ ప్రాంతాల్లో రిటర్నింగ్ వాల్స్, విద్యుత్ తదితర సమస్యలపై దృష్టి సారించాలని విన్నవించారు.

అన్నసమారాధన

మల్కాపురం, అక్టోబరు 4 : యారాడ సాగర గిరి కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం వందలాది మంది భవానీ భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. ఏటా నిర్వహించే విధంగానే ఈసారీ తొమ్మిదిరోజులపాటు ఈ కార్యక్రమాన్ని 61వ వార్డు టీడీపీ అధ్యక్షుఎడు మజ్జి సోమేశ్ చేపడుతున్నారు. దీనిలో భాగంగానే శుక్రవారం అన్నసమారాధనను ఆయన ప్రారంభించారు.

అనాథాశ్రమానికి నిత్యావసరాలు వితరణ



పిల్లలకు సబ్బులు, టూత్‌పేస్టులు, బిస్కెట్లు అందజేస్తున్న టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు

పెదగంట్యాడ, అక్టోబరు 4: నడుపూరులోని జనరేషన్ యువ అనాథాశ్రమానికి గ్రామపెద్దలు తాటికొండ కాశీవిశ్వేశ్వరరావు రూ. 12వేల విలువ చేసే నిత్యావసరాలు వితరణ చేశారు. టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గందం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీటిని నిర్వాహకులకు అందజేశారు. అనంతరం అక్కడి పిల్లలకు టూత్‌పేస్టులు, సబ్బులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో పరారైన నిందితుడి అరెస్టు

కూర్మన్నపాలెం, అక్టోబరు 4: పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన గంజాయి కేసులోని నిందితుడ్ని ఎట్టకేలకు దువ్వాడ పోలీసులు పట్టుకున్నారు. సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన అరడా శివకుమార్ గంజాయి తరలిస్తుండగా ఈనెల 28న దువ్వాడ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడ్ని అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో ఉంచగా, వారి కళ్లుగప్పి పారిపోయాడు. దీంతో టాస్క్‌ఫోర్స్, దువ్వాడ పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున 88వ వార్డు మంగలపాలెంలో నిందితుడ్ని గుర్తించి, అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

సినిమా గైడ్

- **శ్వాగ్:** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ :** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 75, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34,కాకరకాయలు 46, బీరకాయలు 50, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజ్ 20, క్యారెట్ 48 దొండకాయలు 60, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 85, బరబాటి 46, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 38, దోసకాయలు 36, వె ల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 36, కీరదోస 28, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 44, కంద 62,దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు(కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5,మామిడికాయలు 100, బూడిద గుమ్మడి కాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్


రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 5లో..

ఆ పూల సుగంధం.. పీల్చితే ప్రమాదం!

- ఏడాకుల చెట్లతో జనంలో భయం
- పారిశ్రామిక ప్రాంతంలో విస్తారంగా చెట్లు
- పూత దశ ప్రారంభంతో అప్రమత్తం

మల్కాపురం, అక్టోబరు 4: ఎంతో అందంగా గుబురైన ఆకులు, తెల్లనిపూలగుత్తులతో చూపరులను ఆకట్టుకునే ఏడాకుల చెట్లు (డెవిల్స్ ట్రీ)తో ప్రమాదం పొంచి ఉంది. గుమ్మెత్తించే ఈ చెట్టు పూల వాసనతో తలనొప్పి, శ్వాస కోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటి వల్ల అనారోగ్యం పొంచి ఉందని గుర్తించిన జనాలు ప్రస్తుతం ఆందోళన చెందుతున్నారు. ఈ చెట్టు కింద కూ ర్చునేందుకు.. నిల్చోవడానికి సైతం బెంబేత్తిపోతున్నారు. 2014లో విశాఖలో హుదూద్ తుఫాన్‌లో సృష్టించిన విధ్వంసంలో వృక్ష సంపద పూర్తి గా నాశనమైంది. ఆసమయంలో పచ్చదనం కోసం అనేక చెట్లను నాటారు. వీటిలో డెవిల్ ట్రీలను కూడా ఉన్నా యి. ఈ చెట్టు మిగిలిన వాటితో పోల్చితే చాలా వేగంగా పెరుగుతుంది.పారిశ్రామిక ప్రాంతంలో చాలా మేరకు పెంచారు. అయితే, ఇప్పుడిప్పుడే ఈ చెట్లతో మానవాళికి కలిగే నష్టం ఏమిటో తెలుస్తోంది. గుగూల్‌లో చెక్ చేసినా ఈ చెట్లు వల్ల కలిగే నష్టం తెలుస్తుంది. ఈ చెట్లు అక్టోబర్ నెల నుంచి ఫిబ్రవరి వరకు భారీ ఎత్తున పూత పూస్తాయి. ఈ పూత సమయంలో వచ్చే వాసన కూడా ఎంతో బాగుంటుంది. కానీ, పీలిస్తే తల నొప్పి రావడం, శాసకోశ నొప్పి కలుగుతుంది. ఈ చెట్ల ప్రత్యేకత ఎన్ని పూలు ఉంటే అన్నీ ఒకేసారి విరగపూస్తాయి. ఆ సమయంలో ఈ పూలనుంచి వచ్చే వాసన మైమరిపిస్తుంది గానీ ఎంతో ప్రమాదకరమని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వాస్తవంగా ఈ చెట్టుకు పూతపూసిన వెంటనే జీవీఎంసీ ఉద్యో గులు తొలగించాలి, కానీ ఆలా చేయకపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తున్నాయి. గతంలో ఈ చెట్లను కొంత మంది స్వచ్ఛందంగా నరికివేశారు. పారిశ్రామిక ప్రాంతంలో ఈ చెట్లుసెంటర్ డివైడర్‌తో పాటు రహదారులకు ఇరువైపులా ఉన్నాయి. ప్రస్తుతం పూత కాలం కావడంతో సమస్య నెలకొంటోంది. జీవీఎంసీ చొరవ తీసుకుని పూలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



శ్రీహరిపురం ఫుట్‌పాత్‌పై పూతతో ఏడాకుల చెట్టు

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి: జీవీఎంసీ కమిషనర్

ఎన్ ఎ.డి.జంక్షన్, అక్టోబరు 4: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. మర్రిపాలెం ఉడాకాలనీ గ్రీన్‌బెల్ట్ పార్కు, పాస్‌పోర్టు కార్యాలయం ఎదురుగానున్న పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. అపర్ణ అపార్ట్‌మెంట్ ఎదురుగా గ్రీన్ బెల్ట్‌లో కళావేదిక పనులను పరిశీలించారు. అక్కడి పార్కులోని బుద్ధుని విగ్రహం ఏర్పాటులో పలు మార్పులపై కమిషనర్‌కు జియ్యాని శ్రీధర్ నివేదించారు. ఓల్డ్ కరాస చిల్డ్రన్ పార్కులో పనులను వేగవంతం చేయాలన్నారు. ఎన్.ఎ.డి. వరకు ఉన్న గ్రీన్ బెల్ట్‌లోని పార్కుల పనులను పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఎన్.ఎ.డి. ఫ్లైఓవర్ మధ్యలో ఉన్న పార్కులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ సభ్యులనుంచి అభివృద్ధి పనులపై వినతి పత్రం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం ఏఈ ఉషారాణి, హార్టీకల్చర్ ఏఈ అర్చన, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వార్డుల్లో పర్యటిస్తున్న కమిషనర్ సంపత్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, తదితరులు

స్టీల్‌ప్లాంటు సమస్యపై మానవహారం రేపు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 4: విశాఖ స్టీల్‌ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం జాతీయ రహదారి అనగంపూడి నుంచి పాతగాజువాక వరకు భారీ మానవహారం నిర్వహించనున్నట్టు ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. స్టీల్‌ప్లాంటును పరిరక్షించాలని, ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించాలని, కాంట్రాక్టు కార్మికులను తొలగించరాదని, ఉద్యోగుల ఆర్థిక అంశాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన చేపట్టనున్నామన్నారు.

ఆందోళనలో నిర్వాసితులు

పెదగంట్యాడ: స్టీల్‌ప్లాంటు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అగనంపూడి నుంచి పాతగాజువాక వరకు జరగనున్న మానవహారాన్ని విజయవంతం చేయాలని పెదగంట్యాడ నిర్వాసిత నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సమావేశమయ్యారు. నాయకులు గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, నిర్వాసిత నాయకులు అనిపెద్ది మసేన్‌రావు, యెల్లేటి శ్రీనివాసరావు, దొమ్మేటి అప్పారావు, మార్డుపూడి పరదేశి, ములకలపల్లి పెంటయ్య, పిట్ట రెడ్డి, పాల్గొన్నారు.

13న అప్పన్న ఆలయంలో దశమి వేడుకలు

సింహాచలం, అక్టోబరు 4: వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 13న విజయదశమి ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన శరన్నవరాత్రి ఉత్సవాల్లో జరిగే కార్యక్ర మాల వివరాలను ప్రకటించారు.రోజూ ఉదయం శ్రీమద్రామాయణ పారాయణం, సాయంత్రం 5 గంటలకు ఆలయ బేడా మండపంలో అమ్మవార్ల తిరువీధి జరుగుతుందన్నారు. ఈనెల 9 నుంచి 13 వరకు తాయార్ల సన్నిధిలో వీర లక్ష్మీ ఆయుధ పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 13న విజయదశమి పురస్కరించుకుని సింహాద్రినాథుడు రామావతారంలో మధ్యాహ్నం 3గంటలకు మెట్ల మార్గంలో కొండదిగువ పూదోటకు వెళ్లే జమ్మివేట ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

ఇండియా జ్యూవెలరీ ఫెయిర్ ప్రారంభం



జ్యూవెలరీ ఫెయిర్‌లో ఆభరణాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

విశాఖపట్నం, అక్టోబరు 4: పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఇండియా జ్యూవెలరీ ఫెయిర్ శుక్రవారం ప్రారంభమయ్యింది. అదితి ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జ్యూవెలరీ ప్రదర్శన, అమ్మకాలు చేపడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని, దేశం నలుమూలల నుంచి తెచ్చిన విభిన్న డిజైన్లు గల ఆభరణాలు ఫెయిర్‌లో లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. బంగారం, వజ్రాలు, ప్లాటినంతో తయారైన ఆభరణాలు, రత్నాలు పొదిగిన నగలు విస్తృత శ్రేణిలో ఇక్కడ లభిస్తాయన్నారు. అదితి మాత్రమే బి2సి జ్యూవెలరీ ఎక్స్‌పోను రాష్ట్రమంతటా విజయవంతంగా నిర్వహిస్తున్నదని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇండియా జ్యూవెలరీ ఫెయిర్‌కు మొదటి రోజు విశేష స్పందన లభించిందన్నారు. ఇష్టమైన నగలకోసం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, ముంబై, కోల్‌కతా, జైపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఆయా ప్రాంతాల వ్యాపారులు రూపొందించిన అనేక డిజైన్ల ఆభరణాలు ఇండియా జ్యూవెలరీ ఫెయిర్‌లో లభిస్తాయన్నారు. ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని, ఫెయిర్ నిర్వహణకు సహకరిస్తున్న నగర పోలీస్ కమిషనరేట్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

దుర్గాదేవీ.. నమోస్తుతే..!

- ఘనంగా నవరాత్రి ఉత్సవాలు
- వివిధ రూపాల్లో అమ్మవారి దర్శనం
- కుంకుమ పూజలు, అభిషేకాలు



పెందుర్తిలో బాలాత్రిపుర సుందరిగా గాయత్రీమాత



ఎస్టీబీఎల్‌లో చాక్లెట్లు, బిస్కట్లతో అలంకరణ



గాయత్రిదేవి అంకరణలో అగనంపూడిలో అమ్మవారు

అగనంపూడి, అక్టోబరు 4: అగనంపూడి పోస్టాఫీస్ వద్ద గల దుర్గమాంబ ఆలయంలో శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనమిచ్చారు. గాజులతో అలంకరించారు. అధిక సం ఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి ప్రతినిధులు లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం పఠించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు. కనకరాజు, తదితరులు పాల్గొన్నారు. పెదమడక కొండపై వెలసిన దుర్గాభవానీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 88 వార్డు ఎస్టీబీఎల్‌లో పోలమాంబను బాలా త్రిపుర సుందరిగా చంద్రమౌళీ శర్మ పర్యవేక్షణ పూజలు చేశారు. వివిధ రకాల చాక్లెట్లు, బిస్కట్లతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీ కృష్ణయ్య, గంగా మహేశ్, చైతన్య కృష్ణ, వినోద్, భక్తులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో...

జీవీఎంసీ 70 వార్డు ఎల్‌వీ నగర్ కనక దుర్గమ్మ ఆలయంలో గాయత్రీ దేవిగా అరవిల్లి కృష్ణ శర్మ పర్యవేక్షణలో అలంకరించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. డ్రైవర్స్ కాలనీ కనక దుర్గమ్మ ఆలయంలో అర్చకులు కొండూరి సోమేశ్వర శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో శివ, నాయకులు కేవీఎస్ శంకరరావు, పీబీఎల్ మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: స్థానిక కొత్తపాలెం విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గాయతీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో పరిసర ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు.



కొత్తపాలెం విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు

పెందుర్తి: పెందుర్తి ప్రశాంతిగనర్‌లోని దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరి రూపంలో దర్శనమిచ్చింది. చినముషిడివాడ శ్రమశక్తి నగర్‌లోని పంచముఖ గాయత్రీ దేవి ఆలయంలో గాయత్రీమాతగా అలంకరించారు. సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవిని ధాన్యలక్ష్మి అలంకరించి పూజలు చేశారు.పెందుర్తి వెంకటాద్రి శిఖరం దిగువనున్న మహాకామేశ్వరీ ద్వాదశ సహిత జ్యోతిర్లింగాలయంలో అమ్మవారిని బాలాత్రిపుర సుందరి అలంకరణ చేశారు. మండలంలోని ఎస్ఆర్‌పురంలో గల కనకదుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త కాయితి ఎర్రిబాబు ఆధ్వర్యంలో బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనం కల్పించారు. చినముషిడివాడ శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి పర్యవేక్షణలో ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర ఆధ్వర్యంలో శరన్నరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి ఈసందర్భంగా శక్రవారం పీఠం అధిష్ఠాన దేవత శారదా స్వరూప రాజశ్యామల మాతను మహేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు యాగశాలలో చండీ హోమాన్నినిర్వహిస్తున్నారు.సాయంత్రం సామూహిక కుంకుమార్చన సువాసిని పూజలు చేశారు

వేపగుంట/ ఎన్.ఎ.డి.జంక్షన్: నాయుడుతోట కృష్ణానగర్‌లో గుడి వీధిలోని దుర్గా మల్లేశ్వరాలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంలో సామూహిక కుంకుమ పూజలు, అర్చనలు, హోమం నిర్వహించారు. నాయుడుతోట రవనగర్ శేషాద్రి కొండపైనున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరాలయంలో దసరా ఉత్సవాలు పురస్కరించుకుని సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. వేపగుంట ముత్యాలమ్మ ఆలయంలో కూడా కుంకుమ పూజలు జరిపారు. అప్పన్నపాలెం దరి వర్షిణి టవర్స్ జి బ్లాక్‌లో దసరా నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు.ఇక్కడి కుంకుమ పూజల్లో భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.వీరికి కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం అందజేశారు. 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం దుర్గాలమ్మ, బంగారమ్మ ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమపూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధి వాంబే కాలనీ శ్రీవెంకటేశ్వరాలయం ఆవరణలో నిర్వహించిన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు శుక్రవారం ధాన్యలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు దొడ్డి రమణ, మంత్రి మంజుల పర్యవేక్షించారు. ఆదివారం అమ్మవారి సన్నిధిలో సుదర్శన హోమం జరుపుతామన్నారు.



వర్షిణి టవర్స్ జి బ్లాక్‌లో కుంకుమ పూజల్లో పాల్గొన్న నివాసితులు



బుచ్చిరాజుపాలెంలో కుంకుమ పూజల్లో మహిళలు



బీజేపీ సభ్యత్వ నమోదులో గాజువాక బీజేపీ కన్వీనర్ నరసింగరావు, నాయకులు

'ప్రజా సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం విశేష కృషి'

గాజువాక, అక్టోబరు 4: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆ పార్టీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు రెండో విడత కార్యక్రమం శుక్రవారం గంగవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలి దశలోచాలా మంది సభ్యత్వం తీసుకున్నారన్నారు. రెండో విడతగా మరింత మంది ముందుకు రావాలన్నారు. కేంద్రం సహకారంతో రాష్ట్రంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిన పైడిరాజు, రాజన్న, రాజశేఖర్, మాధవి, అప్పారావు పాల్గొన్నారు.

హిందూజా బాధితులకు పరిహారం ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న పాలవలస గ్రామ ప్రజలు

గాజువాక, అక్టోబరు 4: హిందూజా సంస్థతో నష్టపోయిన భూముల రైతులకు న్యాయం చేయాలని పాలవలస గ్రామ బాధితులు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం సంస్థ గేటు వద్ద ఆందోళన చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ హిందూజా యాస్ ఫౌండ్ నుంచి వస్తున్న నీటిని అరికట్టాలని, బొగ్గు లారీల ఓవర్‌లోడ్ తగ్గించాలని, మహిళా కార్మికులకు ఉపాధి కల్పించాలని, హిందూజా నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోనాయకులు పాల అచ్చిల్‌నాయుడు, అప్పారావు, రెడ్డి పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కండి'

కూర్మన్నపాలెం, అక్టోబరు 4: ప్లాస్టిక్ వాడకం నిషేధంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు నాయుడు, జడ్సీ శే షాద్రి, ఏఎంఒహెచ్ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 88 వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్‌లో వారు పాల్గొన్నారు. .ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, కూటమి నాయకులు ముమ్మడివరపు రాము, ఉరుకూటి శ్రీనివాస్, పబ్బిన శ్రీకాంత్, కె. చంద్రశేఖర్, ఒమ్మి రాము, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టులో ముగిసిన హిందీ పక్షోత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే

విశాఖపట్నం, అక్టోబరు 4: విశాఖపట్నం పోర్టు అథారిటీలో హిందీ పక్షోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పోర్టు పరిపాలనా భవన సముదాయంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దుబే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజరు పోర్టులలోహిందీ భాష అమలులో విశాఖపట్నం పోర్టు మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా పోర్టు అధికారులు, సిబ్బందికి హిందీలో వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ పీఎస్ఎల్ స్వామి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

'చెత్త పన్ను రద్దుతో ప్రజల్లో సంతోషం'



మాట్లాడుతున్న గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్

గాజువాక, అక్టోబరు 4: చెత్త పన్ను రద్దుతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్త పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ప్రజలపై ఆర్థిక భారంలేకుండా చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. వైసీపీ పాలనలో అతలాకుతలమైన రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ విశేష కృషి చేస్తున్నారన్నారు. కార్యకమంలో నాయకులు శివప్రసాదరావు, వెంకటేశ్వరరావు, శ్రీను, రాజు, రాజారావు నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐ ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం

గాజువాక, అక్టోబరు 4: ప్రభుత్వ ఐటీఐ ఉద్యోగుల గుర్తింపు పొందిన అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం గాజువాక ఐటీఐలో జరిగాయి. అధ్యక్షునిగా యువి.శివకుమార్, కార్యదర్శిగా పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలిగా ఎం.లతాదేవి, సహాయ కార్యదర్శిగా కె.కిరణ్‌కుమార్, సభ్యులుగా ఎస్.తులసీరావు, పి.వి.డి.ప్రసాద్ ఎన్నికయ్యారు.

నేడు డాక్‌యార్డు వర్క్స్ కమిటీ ఎన్నికలు

మల్కాపురం, అక్టోబరు 4: నేవల్ డాక్‌యార్డు వర్క్స్ కమిటీ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. యార్డులో ఉన్న పది డిపార్టుమెంట్లలో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్నిక జరగనుంది. ఒక్కొక్క డిపార్టుమెంట్‌లో 200 నుంచి 300 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు చేశారు. రెండేళ్లకొక్కసారి ఈ ఎన్నికలు జరుగుతుంటాయి. అయితే, పది డిపార్టుమెంట్‌లకు జరిగిన ఎన్నికల్లో ఏ యూనియన్ అయితే అత్యధిక స్థానాలలో నిలుస్తోందో దానినుంచి సెక్రటరీ, వైస్‌చైర్మన్, జాయింట్ యాక్షన్ కమిటీ మెంబర్‌గా ఉంటారు. మిగతా వారంతా సభ్యులుగా కొనసాగుతారు. వీరు కార్మిక సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తారు. ఈ కమిటీకి ఎన్నిక నిర్వహణలో డాక్‌యార్డు యజమాన్యమే కీలక పాత్ర పోషిస్తుంది. అయితే, ఎవరు గెలిచినా వారి ముందు ప్రస్తుతం ఎస్‌బీసీ వంతెన సమస్య కీలకంగా ఉంది. ఇప్పటికే కొంతమంది నాయకులు యూనియన్లతో సంబంధం లేకుండా యాక్షన్ కమిటీని నియమించారు. ఈ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలోనే ఎస్‌బీసీ వంతెనపై నుంచి ఉద్యోగుల రాకపోకలకు సంబంధించి పోరాటానికి వ్యూహరచన చేస్తున్నారు.

బండి కాదు.. మొండి ఇది..!

- నిలిచిన ఆర్టీసీ బస్సు.. ప్రయాణికుల పాట్లు

సింధియా, అక్టోబరు 4: కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. కూర్మనపాలెం డిపోకు చెందిన ఏపీ 31 జెడ్ 0418 నంబరు గల సిటీ బస్సు (311) సింధియా నుంచి చోడవరం వెళ్తుండగా కల్యాణి ఆసుపత్రి సెంటర్‌లో శుక్రవారం నిలిచిపోయింది. మొరాయించిన ఈ బస్సు ఎంతకీ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. కొందరు ప్రైవేటు వాహనాలని ఆశ్రయించారు. దూర ప్రయాణాలకు ఇలాంటి మూలకు చేరిన దశలో ఉన్న బస్సులు ఉపయోగించడం పట్ల పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సింధియా సమీపంలో నిలిచిన బస్సు


పూర్ణామార్కెట్‌లో దుర్గాలమ్మ


కళింగనగర్ జంక్షన్‌లో గాయత్రిమాత


సీతంపేట పార్వతీశ్వరాలయంలో


వీరాంజనేయునిగా వెంకటేశుడు


డాబాగార్డెన్స్‌లో ఉమాదేవి


సీతమ్మధారలో కన్యకాపరమేశ్వరి

అమ్మలగన్నయమ్మకు అలంకరణల శోభ

జగదాంబ కూడలి, అక్టోబరు 4: శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండోరోజైన శుక్రవారం నగరంలో పలుచోట్ల అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పాతనగరంలో సుప్రసిద్ధ దుర్గాలమ్మ అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా కనిపించారు. తెల్లవారుజాము నుంచే మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. గ్రామ దేవతగా వెలసిన దుర్గాలమ్మకు దసరా పర్వదినాల్లో ప్రత్యేక పూజలు చేయడం, మాలధారణ, మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. శనివారం గాయత్రి దేవిగా, 6న అన్నపూర్ణ, 7న లలితాదేవి, 8న మహాలక్ష్మి, 9న సరస్వతీ దేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, విజయ దశమి రోజైన 12న రాజరాజేశ్వరీ దేవిగా దుర్గమ్మ ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తారు. అమ్మవారి మూల విరాట్టునే రోజుకో రూపంలో అలంకరించడం విశేషం.

డాబాగార్డెన్స్: డాబాగార్డెన్స్ టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట గల శ్రీ శివరామకృష్ణ దేవాలయంలో ఉమాదేవి అమ్మవారు గాయత్రీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు భార్గవశర్మ సంప్రదాయరీతిలో ఘనంగా ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు సామూహికంగా శ్రీ లలితా సహస్రనామ పారాయణం చేశారు. అమ్మవారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి దివ్య మంగళహారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో జీవీ రమాబాయి, ఎం.మన్మథరెడ్డి, ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాధవధార: మాధవధార ప్రాంతంలో దుర్గా అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు. కాలనీలు, మెయిన్ రోడ్ జంక్షన్ల వద్ద వివిధ సంఘాల ఆధ్వర్యంలో వెలసిన దేవీ మండపాల్లో అమ్మవార్లకు విశిష్ట పూజలు చేస్తున్నారు. కళింగనగర్ జంక్షన్‌లో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి ఆటో స్టాండ్ నిర్వహణలో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొన్నారు. నిర్వహణ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించారు. సీతన్నగార్డెన్స్‌లో కొలువైన దుర్గా గాయత్రీ సహిత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని సామూహిక కుంకుమ పూజ చేశారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి పర్యవేక్షణలో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

అల్లిపురం: అల్లిపురం సాయి శ్రీ మేరుట్రస్ట్ సాయి దర్బార్ ప్రాంగణంలో వేంచేసి ఉన్న అనఘలక్ష్మి వారాహి రాజ శ్యామల అమ్మవార్ల సన్నిధానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు మంగళధ్వని, గోపూజ, గణపతి పూజ వేదమంత్రాలతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శ్రీ వారాహి అమ్మవారు శుక్రవారం గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో మహిళలు సామూహిక కుంకుమ పూజ చేసి, లలితా సహస్ర నామం పఠించారు. విజయ దశమి వరకు అమ్మవారికి పూజలు, హోమాలు జరుగుతాయని ట్రస్ట్ సభ్యుడు పి.శ్రీనివాస సుబ్రహ్మణ శాస్త్రి కోరారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దుర్గాదేవిని స్థాపన చేశారు. ఈవో సురేష్ బాబా పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

పార్వతీశ్వరాలయంలో...

సీతంపేట: గణేష్‌నగర్ పార్వతీశ్వరాలయంలో పార్వతీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాజీ శర్మ, భాస్కర శర్మ, ఇతర అర్చక బృందం వేదమంత్రాలతో అమ్మవారికి పూజలు చేశారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్స్‌లోని మహా గణపతి, ప్రసన్న వెంకటేశ్వర, అయ్యప్ప, షిరిడి సాయిబాబా ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు, దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా వెంకటేశ్వరస్వామి వారిని జై వీరాంజనేయ స్వామి అలంకరణలో, దుర్గాదేవిని కన్యకాపరమేశ్వరిగా అలంకరించారు. లయ ఈఓ బండారు (పసాద్ ఆధ్వర్యంలో గరుడ వాహనంపై తిరువీధుల్లో ఉత్సవమూర్తులను ఊరేగించారు.

ఉత్సవాల ఊరేగింపులో డీజేలు నిషేధం: ఏసీపీ

సీతమ్మధార, అక్టోబరు 4: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న సంఘాలు, యువత, భక్తులు తప్పనిసరిగా పోలీసులు, జీవీఎంసీ నియమ, నిబంధనలు పాటించాలని ఏసీపీ కె.లక్ష్మణమూర్తి సూచించారు. నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని సింధుర ఫంక్షన్ హాలులో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మండపాల నిర్వాహకులతో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏసీపీ లక్ష్మణ మూర్తి మాట్లాడుతూ ఉత్సవాల్లో డీజేలు, బాణసంచాను నిషేధించామన్నారు. ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, ఎవరికీ ఇబ్బందులు కలిగించకుండా, పెద్ద శబ్దాలతో డీజేలు పెట్టకుండా భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ జి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ కె.లక్ష్మణమూర్తి

తేడా వస్తే నిర్వాహకులదే బాధ్యత

మర్రిపాలెం: ఎయిర్‌పోర్ట్ పోలీసుస్టేషన్ పరిధిలోని కాలనీల్లో దేవినవరాత్రుల ఉత్సవ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ చక్రధరరావు కోరారు. శుక్రవారం నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. అమ్మవారి మండపాల పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరిగి తే నిర్వహకులే బాధ్యత వహించవలసి ఉంటుందన్నారు. అవసరమనుకుంటే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఉత్సవాల నిర్వాహకులకు తెలిపారు. ఎస్సై రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్‌లో పేర్లు నమోదు చేయించుకోండి

అక్కయ్యపాలెం, అక్టోబరు 4: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌లో అర్హులైన ప్రతి ఒక్కరూ పేర్లు నమోదు చేయించుకోవాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమారె, బీజేపీ నాయకురాల్సు శ్యామలా దీపిక ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రేటర్ 43వ వార్డులో ఆయుష్మాన్ భారత్ అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. దీని ఉపయోప్రయోజనాలను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు తెలియజేసి నమోదు చేయించారు.

టమాటా కోసం బారులు



అక్కయ్యపాలెం, అక్టోబరు 4: టమాట ధర ఒక్కసారిగా పెరిగిపోవడంతో కొనుగోలుదారులు ఆందోళన చెందుతున్నారు. రైతుబజార్లలో శుక్రవారం టమాట ధర కిలో రూ.75కు చేరింది. బహిరంగ మార్కెట్లలో రూ.100 దాటిపోవడంతో వినియోగదారులు రైతు బజార్లలోని విక్రయ స్టాళ్ల ఎదుట బారులు తీరారు. నగరానికి అధిక శాతం టమాట మదనపల్లె నుంచి దిగుమతి అవుతుంది. కొద్దిరోజులుగా అక్కడి నుంచి సరుకు తక్కువగా వస్తోంది. శుక్రవారం నరసింహనగర్ రైతుబజారులో టమాట కోసం కొనుగోలుదారులు ఉదయం నుంచి బారులు తీరారు.

వృద్ధుడి ఆత్మహత్య

సీతంపేట, అక్టోబరు 4: నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి పోర్టు క్వార్టర్స్ వద్ద ఒక వృద్ధుడు ఇంటి హుక్కుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... పోర్టు క్వార్టర్స్‌లో సబ్బవరపు గణేష్ (60) తన భార్య, ఇద్దరు కుమారులతో కలిసి నివాసం ఉంటున్నాడు. గణేష్ పరుపులు కుడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఎక్కువగా మద్యం తాగేవాడు. ఈ క్రమంలో పోర్టు క్వార్టర్స్‌లో శుక్రవారం రాత్రి ఇంటిలో ఉన్న వంట గది హుక్కుకు తాడుతో ఉరేసుకున్నాడు. అతని కుమారుడు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రమీల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. అతడి మృతికి కారణాలు తెలియవలసి ఉందని ఎస్ఐ ప్రమీల తెలిపారు.

మిసెస్ ఇండియా విజేతకు సన్మానం



హేమలత రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

సీతంపేట, అక్టోబరు 4: మలేషియాలో జరిగిన గ్లామ్ ఆన్ మిసెస్ ఇండియా పోటీల్లో విజేతగా నిలిచిన విశాఖకు చెందిన హేమలత రెడ్డి సన్మాన కార్యక్రమాన్ని ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఫైడా కృష్ణ ప్రసాద్, నిర్వాహకులు హేమలత రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, విజేత హేమలత రెడ్డి విశాఖవాసి కావడం గర్వకారణమన్నారు. హేమలత రెడ్డి అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారన్నారు. ఈ సందర్భంగా హేమలత రెడ్డి మాట్లాడుతూ విశాఖలోనే అన్నీ నేర్చుకున్నానన్నారు. ఇప్పుడు ఈ స్థాయిలో ఉండటానికి తల్లిదండ్రుల ఆశీస్సులు, దేవుని కరుణ కారణమని తెలిపారు. త్వరలో ప్యారిస్ ఫ్యాషన్ వీక్‌కు వెళ్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కందుల నాగరాజు, గంట్ల శ్రీనుబాబు, వీరుమామ పాల్గొన్నారు.

కోరాపుట్, అరకు సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, అక్టోబరు 4: వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్‌ప్రసాద్ శుక్రవారం కోరాపుట్, అరకు సెక్షన్‌లో తనిఖీ చేసి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. కోరాపుట్ రైల్వేస్టేషన్‌లో యార్డు, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్, ఇంజనీరింగ్ పరికరాల నిర్వహణపై ఆరాతీశారు. రిలీఫ్ ట్రైన్‌లోని పరికరాలను, వినియోగించే నైపుణ్య పరిజ్ఞానంతోపాటు సేఫ్టీ గాడ్జెట్‌లు, ఆపరేషన్ పద్ధతులను పరీక్షించారు. అలాగే క్రూ లాబీ, రన్నింగ్ రూమ్ నిర్వహణను తనిఖీ చేశారు. దమన్‌జోడి, కోరాపుట్ స్టేషన్ల మధ్య వంతెనలు, సర్క్యులేటింగ్ ప్రాంతాలు, భద్రతా అంశాలను పరిశీలించారు. డబ్లింగ్ లైను నిర్మాణం, ప్రయాణికులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. ఏడీఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, అక్టోబరు 4: రైల్లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు నిందితులను ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకుని వారి వద్ద నుంచి రూ.75 వేలు విలువ చేసే 15 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకుని రైల్వే పోలీసులకు (జీఆర్పీ) అప్పగించారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ ఎ.ఆర్.బిశోయ్ తన సిబ్బందితో ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఒడిశాకు చెందిన గోపాల్ పంగి, మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశాదు దాస్‌లు గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించి పట్టుకున్నారు. వారిని జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారామ్ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారని రైల్వే పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థినుల వంటకాలతో ఆహారోత్సవ్


వంటకాలు తయారు చేస్తున్న విద్యార్థినులు

మహారాణిపేట, అక్టోబరు 4: మన సంప్రదాయ వంటకాల నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తూ విద్యార్థినులతో ఆహారోత్సవ్‌ను నిర్వహిస్తున్నట్లు కాశ్యప్ కరస్పాండెంట్ టీఆర్ఎస్ వర్మ అన్నారు. శుక్రవారం మహారాణిపేటలో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. వంటకాల వైవిధ్యాన్ని జరుపుకొనేందుకు విద్యార్థినులు స్వయంగా తయారు చేసిన సంప్రదాయ వంటకాలను ప్రదర్శించారు. పలువురు వంటకాల రుచి చూసి వారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మన సంస్కృతి వారసత్వం గుబాళిస్తుందన్నారు.

వైసీపీ నూతన అధ్యక్షుడికి అభినందన


అమర్‌నాథ్‌తో పేడాడ నర్సింగరావు, రమణికుమారి

మురళీనగర్, అక్టోబరు 4: వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్‌ను శుక్రవారం ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పేడాడ రమణి కుమారి, విశాఖ జిల్లా కళింగ సంఘం అధ్యక్షుడు పేడాడ నర్సింగరావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. అమర్నాథ్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. నూతన అధ్యక్షుడిగా పార్టీకి మరింత పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా ఆయన సేవలందించాలని ఆకాంక్షించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రతి నాయకుడు, కార్యకర్తకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని అమర్నాథ్ పేర్కొన్నారని తెలిపారు.

'మద్యం దుకాణాల కేటాయింపులో పారదర్శకత ఉండాలి'

అక్కయ్యపాలెం, అక్టోబరు 4: మద్యం దుకాణాల కేటాయింపులో పారదర్శకత పాటించాలని ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు కోరారు. నరసింహనగర్‌లోని సంఘ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ యాత వర్గీయులకు 10 శాతం దుకాణాలను ప్రభుత్వం కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎవరికి ఏ దుకాణం కేటాయిస్తున్నారన్న విషయంపై స్పష్టత లేదన్నారు. దుకాణాలు పొందిన వ్యక్తులకు సంక్షేమ పథకాలు రద్దుకాకుండా చూడాలన్నారు. సమావేశంలో గొడ్డి కన్నారావు, కొలుసు అచ్చిబాబు, సంపంగి మంగరాజు, రమణ, ఓనుం దేవుడు, నెల్లి దేముడు, నెల్లి సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ద్విభాష్యం రాజేశ్వరరావుకు అడివి బాపిరాజు అవార్డు


రాజేశ్వరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సీతంపేట, అక్టోబరు 4: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ హైదరాబాద్, సహృదయ సాహితీ సంస్థ సంయుక్తంగా ప్రముఖ కథారచయిత ద్విభాష్యం రాజేశ్వరరావుకు అడివి బాపిరాజు అవార్డు ప్రదానం చేశారు. సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్‌దాస్, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి మద్దాలి రఘురాం, ఓలేటి పార్వతీశంలు పాల్గొని రాజేశ్వరరావుకు అవార్డును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. డాక్టర్ కేజీ వేణు, సినీ విశ్లేషకులు ఎస్వీ రామారావు, కొవ్వలి లక్ష్మీనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, మస్తాన్ రెడ్డి, ఆదూరి, డాక్టర్ కేవీఎస్ మూర్తి, డాక్టర్ నిర్మలదేవి, బి.రాధారాణి, పరమేశ్వరరావు, ఉప్పల అప్పలరాజు, డాక్టర్ వెలమల సిమ్మన్న పాల్గొన్నారు.

'పోర్టు ఆసుపత్రిపై నిర్ణయం మార్చుకోవాలి'

అక్కయ్యపాలెం, అక్టోబరు 4: పోర్టు ఆసుపత్రిని పీపీపీకి ఇవ్వాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలని సీఐటీయూ నాయకుడు వీఎస్ పద్మనాభరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోర్టు ఆసుపత్రి ఎదుట జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాల్గో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ రూ.222.43 కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలనే కేంద్ర మంత్రి శర్బానంద సోనోవాల్ ఈ ప్రతిపాదన విరమించుకోవాలని, పోర్టు సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ, నర్సింగరావు, ఈశ్వరరావు, శంకరరావు, రాఘవులు, జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నార్స.

వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ విస్తరణ

... 7వ పేజీ తరువాయి

కేటాయిస్తారు. పరిశ్రమలు, విద్యా సంస్థలు, పర్యాటక ప్రాంతాలు, ఆస్పత్రులు, స్టేడియాలు, కొత్త రహదారులు, వాటి మధ్య అనుసంధానం, అవసరమైన చోట్ల వంతెనల నిర్మాణం, సరకు రవాణాకు వీలుగా కారిడార్లు వంటివి అందులో ఉంటాయి. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రహదారులను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తుంది. ఆ ప్లాన్ ప్రకారం ఆయా ప్రాంతాల్లో పరిశ్రమలకు భూములు కేటాయిస్తారు. పారిశ్రామిక పార్కులు, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్లు వంటివి వస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక అంతా అందులో ఉంటుంది.

గ్లోబల్ టెండర్ల ద్వారా ఎంపిక

రాష్ట్ర ప్రభుత్వం ఆయా మండలాలు కూడా వీఎంఆర్‌డీఏలో ఉన్నందున మాస్టర్‌ప్లాన్‌ను విస్తరించాల్సిందిగా సూచించింది. దీనికి గ్లోబల్ టెండర్ల ద్వారా ఏజెన్సీని ఎంపిక చేయాలని అనుకుంటున్నాము. దీనివల్ల తక్కువ వ్యయంతో, తక్కువ సమయంలో ప్రభావవంతమైన ప్రణాళిక తయారవుతుందని భావిస్తున్నాము. త్వరలోనే టెండర్లు పిలుస్తాం.

- విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

ఉక్కు ఉద్యోగులకు విద్యుత్ షాక్

... 7వ పేజీ తరువాయి

జీతాల స్లిప్ అక్టోబరు ఒకటో తేదీ నుంచి ఉద్యోగులకు ఇస్తున్నారు. వాటిని చూసి అంతా ఆందోళన చెందుతున్నారు. క్వార్టర్లలో ఉంటున్న వారికి ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకూ ఎంత విద్యుత్ వినియోగించారో అన్ని యూనిట్లకు ఎనిమిది రూపాయల చొప్పున లెక్కగట్టి జీతం నుంచి కోత వేసింది. ఇలా ఒక్కొక్కరి జీతం నుంచి అధమంగా పది వేల రూపాయల నుంచి అత్యధికంగా రూ.23 వేల వరకూ కోత విధించింది. జీతంలో సగం మొత్తం విద్యుత్ బిల్లుకు తీసుకుంటే ఏమి తిని బతకాలని ఉద్యోగులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. వాయిదాల పద్ధతిలో కట్ చేసినా బాగుండేదంటున్నారు.

వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు

నర్సీపట్నం, అక్టోబరు 4: నర్సీపట్నంలో వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి వి.సుధీర్ తెలిపారు. జిల్లాలో నవోదయం కార్యక్రమం పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. నాటు సారా, గంజాయి నివారణకుచర్యలు తీసుకుంటామన్నారు.

బజాజ్ ఆటో నుంచి గేమ్ ఛేంజర్ బైక్



సీఎన్‌జీ బైక్ బజాజ్ ఫ్రీడమ్ 125ను ఆవిష్కరిస్తున్న వరుణ్‌గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్

సిరిపురం, అక్టోబరు 4: బజాజ్ ఆటో ప్రవేశపెట్టిన ప్రపంచపు మొట్టమొదటి సీఎన్‌జీ గేమ్ ఛేంజర్ బైక్ బజాజ్ ఫ్రీడమ్ 125ను శుక్రవారం సిరిపురం వరుణ్ బజాజ్ షోరూంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభుకిశోర్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌దేవ్, బజాజ్ ఆటో రీజనల్ మేనేజర్ సర్వీస్ సచిన్ జైన్, బజాజ్ ఆటో ఏరియా సర్వీస్ మేనేజర్ ఎన్.భువనేశ్, బజాజ్ ఆటో ఏరియా మేనేజర్ సేల్స్ అబాస్ శేఖరన్ హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సరికొత్త బజాజ్ ఫ్రీడమ్ బైక్ ట్విన్ ట్యాంక్ సెటప్‌ను కలిగి ఉంటుందన్నారు. ఒక ట్యాంక్ పెట్రోల్, మరో ట్యాంక్ సీఎన్‌జీ కోసం ప్రత్యేకంగా డిజైన్ చేశారన్నారు. ఇందులో రెండురకాల ఫ్యూయల్స్‌ను వాడుకోవచ్చునన్నారు. ఫ్యూయల్ ఆప్షన్‌ను ఎంచుకోవడానికి ప్రత్యేకంగా రెండు స్విచ్‌లను ఏర్పాటుశారన్నారు. మూడు రకాల వేరియంట్లలో ఈ బైక్ లభ్యమవుతుందని, మొదటి ఎంట్రీ లెవల్ వేరియంట్ బజాజ్ ఫ్రీడమ్ 125 డ్రమ్ ఎక్స్‌షోరూం ధర రూ.95 వేలు కాగా, రెండోది మిడ్ రేంజ్ వేరియంట్ ధర రూ.1.05 లక్షలు, మూడోది టాప్‌ఎండ్ వేరియంట్ డిస్క్ ఎల్ఈడీ రూ.1.10 లక్షలని వివరించారు. ఈ కార్యక్రమంలో వరుణ్ బజాజ్ సీఈఓ ఆదారి శ్రీనివాస్, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.63,266.1 కోట్లతో జిల్లా వార్షిక ప్రణాళిక

... 7వ పేజీ తరువాయి

సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ ప్రణాళిక దోహదపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలను ప్రోత్సహించేలా రైతులకు అండగా నిలిచేలా రుణ మంజూరు ప్రక్రియ ఉండాలన్నారు. సాధారణ పౌరుల నుంచి వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత కాలంలో రుణాలు అందించాలన్నారు. సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి ఎక్కువ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అమలు చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు బ్యాంకులు అందిస్తున్న రుణ సాయం గురించి ఆరా తీసిన కలెక్టర్ అందరికీ ప్రయోజనం కలిగిలా సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎం.శ్రీనివాస్, రిజర్వుబ్యాంకు ప్రతినిధి పి.పూర్ణిమ, నాబార్డు డీజీఎం సమంత్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, పలువురు అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

మరోసారి తెరపైకి ఐఐటీ హోదా

... 7వ పేజీ తరువాయి

స్థాయి ప్రమాణాలతో రాష్ట్రంలోని విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందిస్తున్న అతి పెద్ద కాలేజీకి ఐఐటీ హోదా కల్పిస్తే లోకల్ విద్యార్థులు ఇబ్బంది పడాల్సి వస్తుందనే వాదన కూడా ఉంది. అందుకే ఈ విషయంలో వర్సిటీ అధికారులు వెనక్కి తగ్గుతున్నట్టు చెబుతున్నారు. దీనిపై ప్రస్తుత వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జి.శశిభూషణరావును వివరణ కోరగా గతంలో ప్రతిపాదనలు వచ్చాయన్నారు. ప్రస్తుతా నికి తాము ఎటువంటి ప్రతిపాదనలు పెట్టలేదన్నారు. దీనిపై ఉన్నత విద్యా శాఖ ఆదే శాలకు అనుగుణంగా నడుచుకుంటామన్నారు.

అందని పీఎఫ్, గ్రాట్యుటీ

... 7వ పేజీ తరువాయి

అందక, అటు దాచుకున్న మొత్తం ఇవ్వకపోతే తాము ఎలా బతుకుతామని ఉద్యోగుల కుటుంబాలు వాపోతున్నాయి. ఇప్పటికే కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయి బాధపడుతుంటే...తాము దాచుకున్న, న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన సొమ్మును వెనక్కి ఇవ్వడానికి ఎందుకు తాత్సారం చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఆ 80 మందిలో ముగ్గురు ఉద్యోగుల భార్యలు కూడా ఇటీవల చనిపోయారు. అంటే ఆ కుటుంబాలకు అమ్మ, నాన్నలు లేరు. యాజమాన్యం ఇచ్చే పీఎఫ్, గ్రాట్యుటీలే పిల్లలకు ఆధారం. వారి చదువులు, వివాహాలకు వాటిని ఉపయోగించుకోవాలని ఆశిస్తున్నారు. ఆరు నెలలు అవుతున్నా ఏప్రిల్ నుంచి ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని, ప్లాంటులో ఉన్నతాధికారులకు లంచాలు ఇచ్చే వారికే బిల్లులు మంజూరు చేస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. తమకు వెంటనే సెటిల్‌మెంట్ చేయకపోతే పిల్లలతో కలిసి ప్లాంటు ముందే ప్రాణం తీసుకుంటామని పలువురు హెచ్చరిస్తున్నారు.

ఉక్కు మంత్రిత్వ శాఖను అడగమంటున్నారు

నా పేరు డీవీ శర్మ. స్టీల్‌ప్లాంటులో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేసి అనారోగ్య కారణాలతో రాజీనామా చేశాను. మార్చి నెలతో నాకు 60 ఏళ్లు పూర్తయ్యాయి. నేను దాచుకున్న పీఎఫ్, గ్రాట్యుటీ కోటి రూపాయల వరకూ యాజమాన్యం వద్ద ఉన్నాయి. రిటైర్‌మెంట్ వయస్సు అయిపోయిందని పెన్షన్ ఠంచనుగా ఏప్రిల్ నుంచి ఆపేశారు. మరి మాకు రావలసిన మొత్తాలు ఇవ్వడం లేదు. ప్లాంటులో ఆర్థిక విభాగం అధికారుల వద్దకు వెళ్లి అడిగితే ఉక్కు మంత్రిత్వ శాఖను వెళ్లి అడగండని సమాధానం చెబుతున్నారు. **- డీవీ శర్మ, రిటైర్డు ఉద్యోగి**

పర్యాటక ప్రాజెక్టులపై కొనసాగిన విచారణ

... 7వ పేజీ తరువాయి

నిర్ణయించారు. అయితే ఇంజనీరింగ్ అధికారుల నిర్వాకం వల్ల అది ఇప్పటికీ పూర్తికాలేదు. దీనిపై కూడా కమిటీ విచారించింది. ఆ తరువాత సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్‌లోని పర్యాటక అభివృద్ధి సంస్థ కార్యాలయానికి వెళ్లి రుషికొండలో కూలగొట్టిన హరిత రిసార్ట్స్‌లోని ఫర్నీచర్ ఏమైందని ప్రశ్నించింది. ఆ సమయంలో అక్కడ పనిచేసిన సిబ్బంది వేరే ప్రాంతంలో ఉంటే వారిని పిలిపించి విచారణ జరిపింది. గోడౌన్‌లో ఉన్నట్టు సమాధానం చెప్పడంతో వాటిని పరిశీలిస్తామని కమిటీ పేర్కొంది. ఆ తరువాత అదే భవనంలో జిల్లా పర్యాటక శాఖ అధికారిని కలిసి జిల్లాలో పర్యాటక అంశాలపై పలు వివరాలు సేకరించింది. తొట్లకొండలో బే వాచ్ రిసార్ట్ లీజులో విచారణ నివేదిక అడిగి కమిటీ తీసుకుంది. ఆ తరువాత రుషికొండ బ్లూఫ్లాగ్ బీచ్‌కు మరోసారి వెళ్లి అక్కడి కార్యకలాపాలపై ఆరా తీసింది.

రాత్రి గస్తీపై నిర్లక్ష్యం!

... 7వ పేజీ తరువాయి

తరలించి కౌన్సెలింగ్ ఇవ్వడం, రోడ్లపై అనవసరంగా తిరిగే వారిని ఇళ్లకు పంపించడం చేస్తుంటారు. దీనివల్ల నగరంలో చోరీలకు కొంతవరకూ అడ్డుకట్ట పడడంతోపాటు గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిలకు ముకుతాడు వేసేందుకు అవకాశం ఉంటుంది. అయితే నగరంలో గత కొద్దిరోజులుగా రాత్రి గస్తీ తగ్గిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజయవాడలో దుర్గా నవరాత్రి ఉత్సవాలకు బందోబస్తు కోసం నగరం నుంచి 250 మంది సిబ్బందిని పంపించారు. వారితోపాటు మూడు ఏఆర్ పార్టీలను కూడా పంపించారు. రాత్రి బీట్ తిరిగే వారిని ఇతర అవసరాలకు కేటాయిస్తున్నారు. దీనివల్ల నగరంలో రాత్రివేళ పోలీస్ నిఘా, పెట్రోలింగ్ కొరవడింది. ప్రస్తుతం క్రైమ్ బీట్‌లు 100కి తగ్గిపోగా, లా అండ్ ఆర్డర్ బీట్‌లు కూడా 120కి తగ్గిపోయినట్టు తెలిసింది. రాత్రి బీట్‌లు తగ్గిపోవడంతో నేరస్థులు, ఆకతాయిలు చెలరేగిపోతున్నారు. రాత్రి సమయంలో ఒంటరిగా వెళ్లే వాహన చోదకులు, పాదచారులను అడ్డగించి దోచుకోవడం, దాడులకు పాల్పడడం వంటి సంఘటనలు నమోదవుతున్నాయి. ఈనెల రెండో తేదీ రాత్రి స్విగ్గీ డెలివరీ బాయ్ మద్దిలపాలెం ఏయూ అర్చ్ నుంచి పెదవాల్తేరు వైపు వెళుతుండగా ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్ సమీపానికి వెళ్లేసరికి అతని బైక్‌ను గంజాయి మత్తులో ఉన్న కొంతమంది అడ్డగించారు. కత్తులతో బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కొనేందుకు యత్నించారు. స్విగ్గీ బాయ్ కేకలు వేయడంతో పరారైపోయారు. ఇలాంటి సంఘటనలు ఇటీవల అనేకం జరిగాయి. పోలీసు అధికారులు ఇప్పటికైనా రాత్రి గస్తీపై దృష్టిసారించాలి.

దూరప్రాంతాలకు ఆరు ప్రత్యేక బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, అక్టోబరు 4: దసరా ప్రయాణికుల రవాణాకు ఆర్టీసీ శుక్రవారం ఆరు ప్రత్యేక సర్వీసులు నడిపింది. హైదరాబాద్‌కు 12 షెడ్యూల్ సర్వీసులున్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ మేరకు మరో మూడు ప్రత్యేక సర్వీసులు, విజయవాడకు ప్రతి గంటకు షెడ్యూల్ సర్వీస్ ఉన్నప్పటికీ సీటింగ్ కెపాసిటీకి మించి డిమాండ్ ఉండడంతో మూడు ప్రత్యేక సర్వీసులు నడిపించింది. శనివారం సాయంత్రం నుంచి మరిన్ని ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు సిద్ధం చేశామని విశాఖ రీజియన్ అధికారులు తెలిపారు.

పక్షుల సంరక్షణకు చర్యలు

ఆరిలోవ, అక్టోబరు 4 : జూపార్కులో పక్షుల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. పక్షుల ఎన్‌క్లోజర్‌లో లవ్ బర్డ్స్‌తో పాటు పలు జాతుల నెమళ్లు, మాట్లాడే మైనా, చిలుకలు తదితర రకాలు ఉన్నాయి. గతంలో వాటి చుట్టూ నెట్లు ఏర్పాటు చేసేవారు.ప్రస్తుతం వాటిని తొలగించి, ఆ స్థానంలో గాజు గ్లాస్ ఫ్రేమ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. దీని వల్ల ఎన్‌క్లోజర్‌లో ఉన్న పక్షులు సందర్శకులకు బాగా కనిపిస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈనెలాఖరులోగా ఈ పనులు పూర్తవుతాయని తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 12 మందికి జరిమానా

ఎండాడ, అక్టోబరు 4 : డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రెండవ స్పెషల్ జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి 12 మందికి జరిమానా, నలుగురికి మూడు రోజులు సాధారణ జైలు శిక్ష విధించారని పీఎంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ డి. రమణమూర్తి తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ప్రకారం..స్టేషన్ పరిధిలోని పీఎంపాలెం, మధురవాడ, మారికవలస ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందిపై కేసు నమోదు చేశారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపరచగా జడ్జి 12 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేలు చొప్పున జరిమానా, నలుగురికి మూడు రోజులు సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 50 జరిమానా విధించినట్టు ఎస్‌ఐ చెప్పారు.

లక్ష్మీనారాయణ ఆలయంలో పూజలు

ఆరిలోవ, అక్టోబరు 4 : జీవీఎంసీ పదో వార్డు వెటర్నరీ కాలనీలో ఉన్న లక్ష్మీనారాయణ ఆశ్రమంలో లక్ష్మీనారాయణలకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

ఆరిలోవ, అక్టోబరు 4 : జీవీఎంసీ పదో వార్డు పాత డెయిరీ ఫారానికి సమీపంలో ఉన్న జాతీయ రహదారి పరిధిలోని వీధి లైట్లకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. కొన్ని నెలలుగా ఇక్కడ లైట్లు వెలగకపోవడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడేవారు. ఈవిషయమై వారు జోనల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ సిబ్బంది అన్ని లైట్లను బాగుచేశారు.

ఠారెత్తించిన ఎండ



నిర్మానుష్యంగా జాతీయ రహదారి

మధురవాడ, అక్టోబరు 4 : మధురవాడ పరిసరాల్లో శుక్రవారం ఎండ తీవ్రత మండు వేసవిని తలపించింది. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడు చుర్రుమనిపించాడు. మధ్యాహ్నం 11 గంటల సమయానికి సర్వీసు రోడ్డుతో పాటు జాతీయ రహదారిపై కూడా వాహనాల రాకపోకలు మందగించాయి. అత్యవసర పని మీద బయటకు వెళ్లే వారు తప్ప రోడ్లపై ఎవరూ కనిపించలేదు. శీతాకాలం ప్రారంభ సమయంలో కూడా భానుడి ప్రతాపం, ఉక్కపోతతో భిన్న వాతావరణం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ వితరణ

భీమునిపట్నం, అక్టోబరు 4 : పట్టణంలోని బోయ వీధికి చెందిన దివ్యాంగుడు బెల్లాన ఆనంద్‌కు కనకల లక్ష్మీ ట్రై సైకిల్‌ను వితరణగా అందజేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

దాకమర్రిలో కొట్లాటపై కేసు నమోదు

భీమునిపట్నం (రూరల్), అక్టోబరు 4 : దాకమర్రి టోల్‌గేట్ వద్ద గురువారం రాత్రి జరిగిన కొట్లాటకు సంబంధించి కేసు నమోదు చేశామని సీఐ సుధాకర్ తెలిపారు. గాయపడిన ఇద్దరు వ్యక్తులకు చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించామన్నారు. టోల్ గేట్ ప్రాంతంలో కొంత మంది డ్రైవర్లు సిబ్బందిపై దాడి చేసినట్టు ఫిర్యాదు అందిందని, ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని చెప్పారు.

సినిమా గైడ్

- **శ్వాగ్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శ్రీకన్య శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక), సప్తగిరి (తగరపువలస)
- **దక్షిణ :** కిన్నెర, శారద, గోకుల్, శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య హెవెన్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **రామ్‌నగర్ బన్నీ :** రమాదేవి, విశేష్ (గాజువాక)
- **దేవర :** మెలోడి, జగదాంబ, శరత్, కామేశ్వరి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), రాములమ్మ (తగరపువలస)
- **సత్యం సుందరం :** సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 49, టమాటా 75, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 54, బెండకాయలు 34, పచ్చిమిర్చి 34, కాకరకాయలు 46, బీరకాయలు 50, ఆనపకాయలు 24, కాలీఫ్లవర్ 44, క్యాబేజి 20, క్యారెట్ 48 దొండకాయలు 60, బంగాళదుంపలు 30, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది) 85, బరబటి 46, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 38, దోసకాయ 36, వెల్లుల్లి (పెద్దవి) 280, కొబ్బరికాయ (పెద్దది) 26, బీన్స్ (పెన్సిల్) 98, పొటల్స్ 36, కీరదోస 28, కాప్సికమ్ 66, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 46, చిలగడదుంపలు 44, కంద 62, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాల కూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 30, మామిడి అల్లం 90, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	110
ఫారం ధర	--	130
విత్ స్కిన్	--	230
స్కిన్‌లెస్	--	240

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 5 లో..

దీపోత్సవం నాటికి ఆలయ పునర్నిర్మాణం పూర్తి

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- అనంతుని ఆలయం, ఘాట్ రోడ్డు పనులు పరిశీలన



ఆలయ ఘాట్ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

పద్మనాభం, అక్టోబరు 4 : పద్మనాభంలో అనంతుని ఆలయ పునర్నిర్మాణాన్ని దీపోత్సవం నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన అనంతుని గిరిపైకి వెళ్లి ఆలయ పునర్నిర్మాణం గురించి ఈఓ నానాజీబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపోత్సవం నాటికి ఎట్టి పరిస్థితుల్లో ఆలయ నిర్మాణం పూర్తి చేయాలన్నారు. అనంతరం ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. పంచాయతీరాజ్ శాఖ ఇంజనీరింగ్ అధికారులను రోడ్డు నిర్మాణం ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. నవంబరు 15 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా రిటైర్డు పీఆర్ డీఈఈ కృష్ణకుమార్ ఆలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పనుల గురించి ఎమ్మెల్యేకు నివేదిక అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలి

స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. రెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు నెలకొల్పిన స్వాతంత్ర్య సమరయోధుడు కశిరెడ్డి పాపయ్య విగ్రహాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాపయ్య తన దాతృత్వంతో పాఠశాలకు స్థలాన్ని దానంగా ఇచ్చి ఎంతోమందికి చదువుకునే భాగ్యం కల్పించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయకుమార్, టీడీపీ నాయకులు దామోదరరావు, రమణ, నందీశ్వరరావు, నగేశ్ కుమార్, శ్రీరాములు, సురేష్, ఆర్ఎఎన్ మూర్తి ప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.



ఎండాడలోని దుర్గాదేవి ఆలయంలో బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు



జిమ్‌సర్‌లో గోదాదేవి అలంకరణలో రాజరాజేశ్వరీ దేవి




సింహాచలంలో గాయత్రీదేవిగా ఉమాదేవి అమ్మవారు



పద్మనాభంలోని గెద్దపేటలో బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు

పలు రూపాల్లో దుర్గాదేవి

తూర్పు, భీమిలి నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శుక్రవారం పలు అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



భీమిలిలో గాయత్రీదేవి అవతారంలో పద్మావతి అమ్మవారు



గాయత్రీ మాతగా దుర్గమ్మ

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



సింహాచలం, అక్టోబరు 4 : అప్పన్న ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవార్ల తిరువీధి వైభవంగా నిర్వహించారు. సాయంత్రం సువర్ణ, చతుర్భుజి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఉంచి నాదస్వరాలపనలు, పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ బేడా మండపంలో తిరువీధి జరిపారు. ఉత్సవంలో భాగంగా అష్టదిక్పాలకు పూజలు చేసి నివేదనలిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా కొండ దిగువ ఎస్‌వీఎల్ఎన్ యూత్ అసోసియేషన్, 98వ వార్డు శివారు గ్రామం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళేశ్వరస్వామి దేవేరి ఉమాదేవి పంచముఖ గాయత్రీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

83 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సుబ్బిరెడ్డి

మద్దిలపాలెం, అక్టోబరు 4 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 83 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు.మిరాకిల్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్, డబ్ల్యూఎన్ఎస్, ఐస్మార్ట్ సొల్యూషన్స్, మెడ్‌ప్లస్ ఫార్మా సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహించాయి. నగరంలోని పలు కళాశాలల నుంచి 477 మంది హాజరుకాగా 83 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగుల ఉపాధి కల్పనకు ప్రైవేట్ కంపెనీలతో చర్చించి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగ అవకాశాలు ఉంటున్నాయని, విద్యార్థులు ఆ దిశగా స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరి, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రమేశ్, కళాశాల ప్రిన్సిపాల్ విజయ బాబు, వైస్ ప్రిన్సిపాల్ పి. జయ, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, అక్టోబరు 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచరాలు సమర్పించారు. అనంతరం శాస్త్రోక్తముగా కల్యాణ క్రతువు నిర్వహించారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

సీఎం సహాయ నిధికి రూ. 5 లక్షల విరాళం



రిజిస్ట్రార్ ధనుంజయరావుకు విరాళం అందజేస్తున్న జీవీపీ సంస్థ సభ్యులు

వెంకోజీపాలెం, అక్టోబరు 4 : వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి గాయత్రి విద్యా పరిషత్ రూ. 5 లక్షలు విరాళం ప్రకటించింది. విరాళం మొత్తం చెక్కు రూపంలో జీవీపీ సంస్థల తరపున ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావుకు శుక్రవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య టీవీ కృష్ణ, అసోసియేషన్ డీన్ ఆచార్య నాగ హనుమాన్, తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి : సీపీఎం

సిరిపురం, అక్టోబరు 4 : కూటమి ప్రభుత్వం తక్షణమే ఉచిత ఇసుక పాలసీ అమలు చేసి భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉందన్నారు. భవన నిర్మాణదారులు కొనుగోలు చేద్దామంటే ఇసుక దొరకడం లేదని చెప్పారు. దీంతో 50 వేల మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్, గంగారావు, ఈశ్వరమ్మ, కుమార్, అప్పలరాజు, నరేంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

తగరపువలస, అక్టోబరు 4 : తగరపువలస కూడలిలో ట్రాఫిక్ నిబంధనలపై పోలీసులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలి నుంచి బైపాస్ రోడ్డు వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్ఐ సీహెచ్ చిరంజీవిరావు, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతోనే నగర అభివృద్ధి

సిరిపురం, అక్టోబరు 4 : నగరాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ శివ ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను జీవీఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి, సభ్యులు కలిశారు. కార్యక్రమంలో కన్వీనర్ రాజన వెంకట్రావు, కార్యదర్శి రంది సాధూరావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, పీఏ రాజు, పైల కృష్ణారావు, ప్రసాద్, నాయుడు, గోవిందరావు, సత్యనారాయణ, గణేశ్ పాల్గొన్నారు.

ఒకే దేశం.. ఒకే ఎన్నికపై సదస్సు

వెంకోజీపాలెం, అక్టోబరు 4 : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖ లోకల్ బ్రాంచ్, ఏయూ రాజనీతి అండ్ ప్రభుత్వ పాలనా శాస్త్రం ఆధ్వర్యంలో శుక్రవారం 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సుదర్శనరావు మాట్లాడుతూ దేశమంతా ఒకే ఎన్నిక మంచిదే కానీ దేశంలో ఉన్న విభిన్న జాతులను పరిగణనలోకి తీసుకుని ఒకే ఎన్నిక ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్వ సభ్యుడు ఆచార్య కేఎస్. చలం, పలువురు ఆచార్యులు పాల్గొన్నారు.



డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా, పక్కన జేసీ అశోక్

పద్మనాభంలో డీసీసీబీ బ్రాంచ్ ప్రారంభం

పద్మనాభం, అక్టోబరు 4 : పద్మనాభంలో ఏర్పాటు చేసిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు 32వ శాఖను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యకలాపాలను, ఈ ప్రాంతంలోని రైతులకు, ప్రజలకు అందించే సేవల వివరాలను డీసీసీబీ అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ అన్ని రకాలుగా వారికి సేవలు అందించాలన్నారు. అవసరమైన పెట్టుబడి సాయాన్ని తక్కువ వడ్డీకి అందిస్తూ ప్రైవేటు వడ్డీ వ్యాపారుల కబంధ హస్తాల్లో రైతులు చిక్కుకోకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్, డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి మయూర్ అశోక్, సీఈఓ డీవీఎస్ వర్మ, డీసీఓ ప్రవీణ, బ్రాంచ్ మేనేజర్ వెంకట అప్పారావు, ఎంపీపీ రాంబాబు, టీడీపీ నాయకులు రమణ, దామోదరరావు, నగేష్‌కుమార్, నందీశ్వరరావు, లీలావతి పాల్గొన్నారు.

భీమునిపట్నం : ఎంవీపీ కాలనీలో ఉన్న గంటా నివాసంలో గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు, ఏపీ ఈపీడీసీఎల్ విశాఖ జోన్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీరు చక్రవర్తి వున్నారు.

ఏడో వార్డులో సమస్యలపై వినతి

మధురవాడ, అక్టోబరు 4 : జీవీఎంసీ ఏడో వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు పిళ్లా మంగమ్మ, కమిషనర్ సంపత్ కుమార్‌ను కోరారు. శుక్రవారం ఆమె జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రంపాలెం, వాంబేకాలనీ, నగరంపాలెం, మల్లయ్యపాలెం పరిధిలో శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలన్నారు.

డిగ్రీ కళాశాలలో మిగుల సీట్ల భర్తీకి చర్యలు

మద్దిలపాలెం, అక్టోబరు 4 : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ విజయబాబు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల వారు ఒరిజనల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రతించాలని సూచించారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

వెంకోజీపాలెం, అక్టోబరు 4 : ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వచ్చే ఏడాది జనవరి 24 నుంచి మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ శశిభూషణరావు శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ధనుంజయ్‌రావు, రెక్టార్ ఆచార్య కిశోర్‌బాబు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

పెదవాల్తేరు, అక్టోబరు 4 : పెదవాల్తేరు బజార్ ఆవరణలో కొందరు వాహన దారులు ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు నుంచి సీబీఐ కార్యాలయం వరకు ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే స్టేషన్‌కు వచ్చేవారు వాహనాలను ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలి యక రోడ్డుపై నిలిపివేస్తున్నారు. దీని వల్ల నిత్యం ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై పోలీసులు, రైతు బజార్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

13న అప్పన్న ఆలయంలో విజయ దశమి వేడుకలు

సింహాచలం, అక్టోబరు 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 13న విజయదశమి ఉత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ స్థానాచార్యులు డా. టిపి రాజగోపాల్ తెలిపారు. శుక్రవారం ఆయన శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో జరిగే కార్యక్రమాల వివరాలను ప్రకటించారు. ప్రతిరోజూ ఉదయం శ్రీమద్రామాయణ పారాయణం, సాయంత్రం 5 గంటలకు ఆలయ బేడా మండపంలో అమ్మవార్ల తిరువీధి జరుగుతుందన్నారు. ఈనెల 9 నుంచి 13 వరకు తాయార్ల సన్నిధిలో వీర లక్ష్మీ ఆయుధ పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. 13న స్వామివారు రామావతారంలో మధ్యాహ్నం 3 గంటలకు మెట్ల మార్గంలో కొండదిగువ పూదోటకు వెళ్లే జమ్మివేట ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

తల్లిదండ్రులకు సేవతోనే జీవితానికి సార్థకత

- పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు



ప్రవచనాలు బోధిస్తున్న గరికిపాటి

సిరిపురం, అక్టోబరు 4 : ప్రపంచంలో ఎవరు ఏ స్థాయిలో ఉన్నా.. తల్లిదండ్రులను మరిచిపోరాదని, వారికి సేవ చేయడం వల్ల జీవితానికి సార్థకత లభిస్తుందని ప్రముఖ ప్రవచకుడు, పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. సిరిపురం లోని గురజాడ కళాక్షేత్రంలో రోటరీ క్లబ్ విశాఖపట్నం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కూడా 'దేవీ వైభవం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లా డుతూ మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ఎందరినో కలుస్తారని, వారంతా కోపతాపాలు వస్తే మధ్యలోనే దూరమైపోతారని, ఎటువంటి లాభాపేక్ష లేకుండా చివరి వరకు ఉండేది తల్లిదండ్రులు మాత్రమేనని చెప్పారు. తల్లిదండ్రులను మించిన దైవం లేదన్నారు. ధనికులతో పాటు మంచిస్థాయిలో ఉన్న వారు పేదలపై జాలి, దయ కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు శేషస్వామి, సింహాచలం ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు, రోటరీ విశాఖ ప్రోగ్రామ్ ఛైర్మన్ జగన్‌మోహన్, ప్రెసిడెంట్ వినయగాంధీ, సెక్రటరీ మణిమాల, కోశాధికారి కుమార్ పాల్గొన్నారు

120 మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం, అక్టోబరు 4 : పట్టణంలోని ఆంధ్రా బాప్టిస్ట్ చర్చి ఆవరణలో విశాఖ వైఎంసీఏ, సౌత్ ఈస్ట్ రీజియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం వైద్యులు 120 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఈస్ట్ ఇండియా రీజియన్ ఛైర్మన్ డాక్టర్ రోలండ్ విలియమ్స్, వైఎంసీఏ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ స్టీఫెన్ పీటర్, రీజినల్ సెక్రటరీ బెట్స్ విలియమ్స్, భీమిలి వైఎంసీఏ అధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి ఆల్బర్ట్ సుదర్శన్, కోశాధికారి ప్రేమానందం, టీడీపీ నాయకులు గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, యరబాల అనిల్ ప్రసాద్, బీజేపీ నాయకులు కంటుభుక్త రామానాయుడు, కె. సునీత తదితరులు పాల్గొన్నారు.

జిమ్‌సర్‌లో ఫార్మకాలజిస్టుల జాతీయ సమావేశాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ ఫార్మకాలజిస్ట్ సొసైటీ సభ్యులు

ఎండాడ, అక్టోబరు 4 : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్) వేదికగా ఆంధ్రప్రదేశ్ ఫార్మకాలజిస్ట్ సొసైటీ రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫార్మకాలజిస్టుల జాతీయ సమావేశాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జిమ్‌సర్ ప్రో వైస్ ఛాన్సలర్ బి.గీతాంజలి మాట్లాడుతూ ఫార్మకాలజీ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు తగిన విధంగా విద్యార్థులు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం వందకి పైగా వచ్చిన పరిశోధనా పత్రాలను నిపుణులు చర్చించారు. ఈ కార్యక్రమంలో జిమ్‌సర్ డీన్ డాక్టర్ ఎస్వీ రావు, ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. శంకర్, జిమ్‌సర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ మాధువులు, ఏపీ ఫార్మకాలజిస్ట్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ మీనా కుమారి, జిమ్‌సర్ మెడికల్ సూపరింటెండెంట్ వసంత కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీలో సీఈ, సీసీపీ బాధ్యతల స్వీకరణ

వెంకోజీపాలెం, అక్టోబరు 4 : రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏపీ సీఆర్‌డీఏ నుంచి జీవీఎంసీకి ఇటీవల బదిలీపై వచ్చిన చీఫ్ ఇంజనీర్ శివప్రసాద్ రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకర్‌రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వారికి ఆయా కార్యాలయాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

సర్వీసు రోడ్డులో ఆక్రమణలు తొలగింపు

తగరపువలస, అక్టోబరు 4 : తగరపువలస కూడలిలో రహదారి పక్కనున్న ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. ఈ ప్రాంతంలో చాలామంది రోడ్డు మార్జిన్‌లో దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేస్తున్నారు. దీని వల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై ఫిర్యాదులు వెళ్లడంతో జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న రాణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు, సీఐ సుధాకర్, ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో ఆక్రమణలు తొలగించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

సింహాచలం, అక్టోబరు 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధీనంలోని సంస్కృత ఉన్నత పాఠశాల విద్యార్థులు సింహగిరిపై శుక్రవారం నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని హెచ్ఎం భాను సారథ్యంలో బాలికలు శాస్త్రీయ నృత్యాలతో పాటు అలనాటి గ్రామీణ వాతావరణంలో పేరొందిన దసరా పాటలను ఆలపించారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను దేవస్థానం ఈఓ త్రినాథరావు జ్ఞాపికలు అందజేసి, శేష వస్త్రాలతో సత్కరించారు.

ఇండియా జ్యూవెలరీ ఫెయిర్ ప్రారంభం



జ్యూవెలరీ ఫెయిర్‌లో ఆభరణాలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

విశాఖపట్నం, అక్టోబరు 4: పీఎంపాలెం వైజాగ్ కన్వెన్షన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించే ఇండియా జ్యూవెలరీ ఫెయిర్ శుక్రవారం ప్రారంభమయ్యింది. అదితి ఈవెంట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జ్యూవెలరీ ప్రదర్శన, అమ్మకాలు చేపడుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని, దేశం నలుమూలల నుంచి తెచ్చిన విభిన్న డిజైన్లు గల ఆభరణాలు ఫెయిర్‌లో లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు. బంగారం, వజ్రాలు, ప్లాటినంతో తయారైన ఆభరణాలు, రత్నాలు పొదిగిన నగలు విస్తృత శ్రేణిలో ఇక్కడ లభిస్తాయన్నారు. అదితి మాత్రమే బి2సి జ్యూవెలరీ ఎక్స్‌పోను రాష్ట్రమంతటా విజయవంతంగా నిర్వహిస్తున్నదని నిర్వాహకులు పేర్కొన్నారు. ఇండియా జ్యూవెలరీ ఫెయిర్‌కు మొదటి రోజు విశేష స్పందన లభించిందన్నారు. ఇష్టమైన నగలకోసం హైదరాబాద్, విజయవాడ, చెన్నై, ముంబై, కోల్‌కతా, జైపూర్ తదితర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఆయా ప్రాంతాల వ్యాపారులు రూపొందించిన అనేక డిజైన్ల ఆభరణాలు ఇండియా జ్యూవెలరీ ఫెయిర్‌లో లభిస్తాయన్నారు. ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నామని, ఫెయిర్ నిర్వహణకు సహకరిస్తున్న నగర పోలీస్ కమిషనరేట్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.